
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పల్నాడు జిల్లా వార్తలు

5

మంగళవారం 28 జనవరి 2025

సచివాలయాల్లో.. సమూల మార్పు

ఏఐ, డ్రోన్ టెక్నాలజీని గ్రామాలకు చేర్చే దిశగా అడుగులు 8



పరిష్కారమే.. పరమావధి

- ప్రజల గొంతుకకు వారధిగా ఆంధ్రజ్యోతి


- అక్షరమే అండ.. పరిష్కారమే అజెండా కార్యక్రమం
- సమస్యల పరిష్కారానికి కదిలిన నేతలు
- నేడు వినుకొండ 23, 31 వార్డుల్లో నిర్వహణ
- హాజరవుతున్న చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, అధికారులు

వినుకొండ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : అక్షర ఆయుధ సమరంలో తనదైన ముద్ర వేసుకున్న ఆంధ్రజ్యోతి ప్రజా సమస్యల పరిష్కారానికి అక్షర వారధిని నిర్మిస్తోంది. ప్రజలు నిత్యం ఎదుర్కొనే సమస్యలను ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకువెళ్లి వాటిని పరిష్కరించేందుకు ప్రజలు, అధికార యంత్రాంగానికి మధ్య వారధిలా నిలవబోతోంది. అక్షరమే అండ.. పరిష్కారమే అజెండా అనే నినాదంతో, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రజా ప్రతినిధులు.. అధికారులకు నివేదించేందుకు వేదికను నిర్వహిస్తున్నది. అధికారులు, ప్రజా ప్రతినిధులను ప్రజల వద్దకే తీసుకువచ్చి సమస్యలు చెప్పుకునే అవకాశం కల్పిస్తోంది. ఇందుకు వినుకొండ మునిసిపాలిటీ వేదిక కానున్నది. మంగళవారం ఉదయం 10 గంటలకు మునిసిపాలిటీలోని 23, 31 వార్డుల్లో అక్షరమే అండ.. పరిష్కారమే అజెండా.. కార్యక్రమం ఆంధ్రజ్యోతి ఆధర్వ్యంలో జరుగుతుంది. ఆయా వార్డుల్లో జరిగే కార్యక్రమాలకు ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, మునిసిపల్ చైర్మన్ షేక్ దస్తగిరి, మునిసిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్, సీఐ శోభన్‌బాబు, మునిసిపల్ అధికారులు, కౌన్సిలర్లు హాజరవుతున్నారు. ఆయా వార్డుల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వీరి దృష్టికి తీసుకువెళ్లవచ్చు. ఇప్పటికే ఆ ప్రాంతంలోని ముఖ్యమైన సమస్యలను గుర్తించడం జరిగింది. పోలీసు అధికారులు కూడా సమావేశంలో పాల్గొని ప్రజలు తెలియజేసే సమస్యలను పరిష్కరిస్తారు. 23 వార్డులోని కొట్నాల్చ బజార్‌లో 10 గంటలకు.. 31 వార్డులోని గాయత్రి నగర్‌లో ఉదయం 10.30 గంటలకు కార్యక్రమం జరుగుతుంది.

సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు

ఆంధ్రజ్యోతి అక్షరమే అండ.. పరిష్కారమే అజెండా కార్యక్రమం సన్నాహక సమావేశం చీఫ్ విప్ జీవీ అంజనేయులు ఆధ్వర్యంలో సోమవారం వినుకొండలో జరిగింది. మునిసిపల్ చైర్మన్ షేక్ దస్తగిరి, కమిషనర్ సుభాష్ చంద్రబోస్, ఏఈ ఆదినారాయణ, కౌన్సిలర్లు వాసిరెడ్డి లింగమూర్తి, పీ పూర్ణ తదితరులు పాల్గొన్నారు. ఆంధ్రజ్యోతి అక్షరమే అండ .. పరిష్కారమే అజెండా కార్యక్రమంలో ప్రజలు తెలియజేసే సమస్యలను వెనువెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని జీవీ ఆంజనేయులు హామీ ఇచ్చారు. ఈ మేరకు పురపాలక అధికారులు, కౌన్సిల్ సహకరించాలని సూచించారు. ఆంధ్రజ్యోతి ప్రజల పక్షాన నిలుస్తోందని వారి సమస్యలను పరిష్కరించడంలో కీలక పాత్ర పోషించిందని జీవీ కితాబిచ్చారు. వార్తల ద్వారా సమస్యలను పరిష్కరించిన ఆంధ్రజ్యోతి ఇప్పుడు నేరుగా ప్రజల వద్దకు వెళ్లి సమస్యలను నేరుగా ప్రజల ద్వారానే తమ దృష్టికి తీసుకొచ్చి వాటి పరిష్కారానికి చేస్తున్న ప్రయత్నం అభినందనీయమన్నారు. ఆంధ్రజ్యోతి కార్యక్రమానికి పూర్తి సహకారం అందిస్తానని.. కార్యక్రమంలో ప్రజలు తెలియజేసే సమస్యలను వెనువెంటనే పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానని జీవీ హామీ ఇచ్చారు.


అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా..





సన్నాహక సమావేశంలో ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, మున్సిపల్ చైర్మన్ దస్తగిరి

రిసార్ట్ మోసాలపై పోలీసుల గురి





- సూర్యలంక హరిత బీచ్ రీసార్ట్ పేరిట సైబర్ వల
- బాధితుల్లో ఎక్కువగా తెలంగాణ రాష్ట్రానికి చెందినవారే
- రెండు వారాల వ్యవధిలో 8 మంది ఉచ్చులో
- బయటపడని వారు మరెందరో
- నకిలీ వెబ్‌సైట్లపై డీజీపీకి లేఖ రాసిన ఏపీటీడీసీ
- సూర్యలంక రిసార్టు నుంచి వివరాలు తీసుకున్న డీజీపీ ఆఫీస్

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

సూర్యలంక హరిత బీచ్ రిసార్టు పేరిట ఉన్న నకిలీ వెబ్‌సైట్‌లో గదులు బుక్ చేసుకుని రెండు వారాల వ్యవధిలో 8 మంది సైబర్ మోసాల బాధితులుగా మిగిలారు. వీరంతా తెలంగాణవారే కాగా, వారాంతంలో ఆహ్లాదంగా బీచ్‌లో కుటుంబ సభ్యులతో కలిసి సేద తీరాలనుకున్న వారు సైబర్ దొంగలు పన్నిన ఉచ్చులో చిక్కుకుని విలవిలలా డారు. బాధితులుగా బయటికొచ్చిన వారు 8 మంది కనబడుతుండగా, పదుల సంఖ్యలో ఈ మోసాల బారిన పడి బయటికి చెప్పనివారు ఉన్నట్లు తెలుస్తోంది. దాదాపు ఐదు నెలల క్రితం ఇదే తరహాలో సూర్యలంక హరిత బీచ్ రిసార్టు పేరిట సైబర్ దొంగలు మోసాలకు పాల్పడ్డారు. అప్పుడు రిసార్టు నిర్వాహకులు బాపట్ల రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, విచారణ దశలోనే ఆ కేసు నీరుగారిపోయింది. తర్వాత కొన్ని రోజుల పాటు స్తబ్దుగా ఉన్న సైబర్ నేరగాళ్లు మళ్లీ జనవరి నుంచి పర్యాటకులే లక్ష్యంగా, అది కూడా సూర్యలంక హరిత బీచ్ రిసార్టుపైనే ఎక్కువగా గురిపెట్టి పెద్ద ఎత్తున మోసాలకు

(మిగతా 8వ పేజీలో)

బాధితుల వివరాలు.. వారు నగదు బదిలీ చేసిన ఖాతాలు..


హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు సంస్థలో పని చేస్తున్న ఉద్యోగి ఈ నెల 12న సూర్యలంక హరిత బీచ్ రిసార్టులో గదులు బుక్ చేసుకోగా రూ.7,535 చెల్లించగా అది నకిలీ వెబ్‌సైట్ అని తాను మోసపోయినట్లు గుర్తించారు. వెంటనే సైబర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయడంతో పాటు బ్యాంకు ఖాతా వివరాలను కూడా సేకరించగా అది మధ్యప్రదేశ్‌లో ఉన్నట్లు తేలింది. ఈ వివరాలన్నింటిని సూర్యలంక హరిత బీచ్ రిసార్టు నిర్వాహకులకు బాధితుడు అందించారు. ఇదే నెల 14న మరో ముగ్గురు బాధితులు వెలుగులోకి వచ్చారు. వీరిలో ఇద్దరు హైదరాబాద్ వాసులు కాగా, మరొకరు ఖమ్మం వాసి. వీరు నకిలీ వెబ్‌సైట్‌లో గదులుబుక్ చేసుకుని కుటుంబంతో కలిసి నేరుగా హరిత బీచ్ రిసార్టుకు రాగా మేనేజర్ అలాంటి బుకింగ్‌లేవీ జరగలేదని సమాధానమివ్వడంతో కంగుతినడం వారి వంత యింది. రూ.15,000 వరకు వీరు మోసపోయారు. వీరంతా కూడా బ్యాంకు ఖాతా వివరాలతో పాటు వెబ్‌సైట్‌లో పొందుపరిచిన ఫోన్ నంబరు తదితరాలతో సమగ్రంగా రిసార్టు నిర్వాహకులకు ఫిర్యాదు చేశారు. బాధితులు ఇచ్చిన వివరాలన్నింటిని సూర్యలంక హరిత బీచ్ రిసార్టు సిబ్బంది ఏపీటీడీసీకి అందించగా, వాటిని డీజీపీ కార్యాలయంలో అందజేశారు. వాటి ఆధారంగానే విచారణ మొదలుపెట్టిన పోలీసులు తొలుత బ్యాంకు ఖాతా వివరాలపై దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. బాధితులు నగదు బదిలీ చేసిన ఖాతాలను బ్లాక్ చేయించే ప్రక్రియ నిబంధనల ప్రకారం ఇప్పటికే మొదలయింది. మరో వారం రోజుల్లో సైబర్ దొంగల ఆటకట్టిస్తామనే ధీమాను పోలీస్ శాఖ వ్యక్తం చేస్తోంది.



హరిత బీచ్ రిసార్టును పోలే విధంగా గదుల చిత్రం డిస్‌ప్లేలో ఫోన్ నంబర్

రూటు మార్చిన ఏపీటీడీసీ

సైబర్ మోసాల బాధితులు ఆ ప్రాంత పరిధిలోని పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు ఇవ్వడానికి వెనకాడడం కూడా ఇన్ని రోజులూ సైబర్ దొంగలకు కలిసి వచ్చింది. దూర ప్రాంతాల నుంచి పర్యాటకులుగా వచ్చేవారు తాము మోసపోయినట్లు రాత పూర్వకంగా ఫిర్యాదు ఇవ్వడానికి అంగీకారం తెలిపేవారు కాదు. మళ్లీ ఇటీవల వరుసగా సూర్యలంక హరిత బీచ రిసార్టు పేరిట సైబర్ మోసాలు వెలుగుచూడడంతో ఏపీటీడీసీ దృష్టి సారించింది. ప్రభుత్వ సంస్థ పేరుతోనే డీజీపీకి నేరుగా ఫిర్యాదు చేయడంతో సైబర్ దొంగల మూలాలను కూపీలాగే పనిలో పోలీస్ శాఖ ఉంది.



సకల జనుల వేదికగా మహోత్సవాలు

బైబిల్ మిషన్ అధ్యక్షుడు జె.శామ్యూల్ కిరణ్



- మహోత్సవాలకు హాజరైన భక్తులు

6



- ప్రసంగిస్తున్న శామ్యూల్ కిరణ్

1 నుంచి రిజిస్ట్రేషన్ చార్జీల పెంపు

- అభివృద్ధి చెందిన ప్రాంతాల్లో 15 నుంచి 25 శాతం పెంపు

గుంటూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : రిజిస్ట్రేషన్ చార్జీల పెంపునకు రంగం సిద్ధమైంది. ఒకటో తేదీ నుంచి నూతన చార్జీలు అమలులోకి వస్తాయి. భూముల మార్కెట్ విలువలపై ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో (మిగతా 8వ పేజీలో)



ఈవో సత్యనారాయణరెడ్డి సస్పెన్షన్‌కు.. 8 రంగం సిద్ధం

- చేయని ఖర్చులు చేసినట్టు చూపి రూ. రెండు కోట్లకు పైగా స్వాహా...
- కమిషనర్‌కు సమగ్ర నివేదిక అందించిన డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్

బీసీల బంధువు టీడీపీ

- రాజకీయ, సామాజిక హోదా ఇచ్చింది
- బీసీల్లో ఆర్థిక విప్లవం కోసం మరింత కృషి
- జగన్ పాలనలో బీసీలందరికీ అవమానాలే...
- బీసీలకు పవర్ లేని పదవులతో అణగదొక్కిన వైసీపీ
- టీడీపీ బీసీ సభలో కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు వ్యాఖ్యలు

గుంటూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): సమాజంలో బలహీన వర్గాలైన బీసీ జన బంధువు టీడీపీ అని, బీసీల రాజకీయ, సామాజిక అభివృద్ధి టీడీపీ ఆవిర్భావంతోనే మొదలైందని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు స్పష్టం చేశారు. గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావుల నేతృత్వంలో గుంటూరు శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో టీడీపీలోని బీసీ మంత్రులకు అభినందన సత్కార సభ సోమవారం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ 1982లో టీడీపీ ఆవిర్భావంతోనే బీసీలకు రాజకీయ ప్రాధాన్యం పెరిగిందన్నారు. పంచాయతీ కార్యాలయాలకు వెళ్లాలంటేనే భయపడే బీసీలకు పార్లమెంటు మెట్లు ఎక్కే వరకు టీడీపీ అభివృద్ధి బాటలు వేసిందన్నారు. బీసీలకు రాజకీయ, సామాజిక హోదాతో పాటు ఆర్థిక పరిపుష్టత కూడా పొంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. జగన్ ఐదేళ్ళ పాలనలో ఇక్కడ జిల్లాల నుంచి ఢిల్లీ వరకు బీసీలకు అన్నీ అవమానాలేనని అన్నారు. పార్లమెంటులో తననే అవమానించేలా వైసీపీ ఎంపీలు వ్యవహరించారని గుర్తుచేశారు. నా బీసీలంటూ పవర్ లేని పదవులు ఇచ్చి అవమానించాడన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలకు పదవులు ఇచ్చినా వారందరూ జగన్, ఆయన పరివారం వద్ద తలవంచి, వారి ముంగిట కూర్చోవాల్సిందేనన్నారు.

వ్యవసాయశాఖ మంత్రి మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ గతంలో ఓటు బ్యాంకుగా ఉన్న బీసీలకు దివంగత ఎన్‌టీఆర్ టీడీపీని స్థాపించి బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. స్థానిక సంస్థల్లో 33 శాతం రిజర్వేషన్‌లు కల్పించిన టీడీపీకి బీసీలు వెన్నుదన్నుగా నిలవాలన్నారు. బీసీల రాజకీయ, సామాజిక, ఆర్థిక ఎదుగుదలకు సీఎం చంద్రబాబు అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత మాట్లాడుతూ బీసీలకు పెద్దపీట వేసేలా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. మెగా డీఎస్సీ ప్రకటించి ఉచిత కోచింగ్ సెంటర్‌లు ఏర్పాటు చేశామన్నారు. త్వరలో ఆన్‌లైన్‌లో కూడా డీఎస్సీ కోచింగ్ కార్యక్రమం ఏర్పాటు చే స్తున్నామన్నారు. బీసీల, ఎస్సీల ద్రోహి జగన్ అని మండిపడ్డారు. రాష్ట్రంలో 8 మంది మంత్రులు, 38 మంది ఎమ్మెల్యేలు, సీఎస్, డీజీపీ, టీటీడీ ఈవో ఎక్కడ చూసినా బీసీలే కనిపిస్తున్నారంటే ఇది బీసీ ప్రభుత్వం కాదా అని స్పష్టం చేశారు.

గృహనిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వ హయాంలో గృహ నిర్మాణాలకు రూ. 3 లక్షలు నుంచి రూ. 3.5 లక్షలు ఇస్తే నా ఎస్సీ, నా బీసీ అనే జగన్ కేంద్ర ప్రభుత్వం రూ. లక్షన్నర ఇస్తే జగన్ కేవలం రూ. 30వేలు ఇచ్చి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. చిన్నతరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో బీసీలకు రావాల్సిన రూ. 74వేల కోట్లను దారి మళ్ళించి తీవ్ర ద్రోహం చేశారని మండిపడ్డారు. అలానే మాజీ సీఎం జగన్ బీసీలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్‌లను 33 శాతం నుంచి 24 శాతానికి తగ్గించి ఎంతో మంది బీసీల నాయకత్వానికి గండికొట్టాడని ధ్వజమెత్తారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణ మాట్లాడుతూ సామాన్య కుటుంబంలో పుట్టిన బీసీ బిడ్డలు ఎమ్మెల్యేలు, ఎంపీ స్థాయికి వెళ్ళారంటే అది (మిగతా 8వ పేజీలో)



మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు, వేదికపై కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, మంత్రులు పార్థసారథి, కొండపల్లి శ్రీనివాస్, సవిత, ఎమ్మెల్యేలు మాధవి, రామాంజనేయులు, శ్రావణ్‌కుమార్

బీఈడీ పరీక్షల ఫీజు తేదీలు మార్పు

పెదకాకాని, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ పరిధిలో బీఈడీ కోర్సు మొదటి సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించి అభ్యర్థులు ఫీజు చెల్లించుకునే గడువును మార్పు చేసినట్లు సీఈ ఆలపాటి శివప్రసాదరావు తెలిపారు. మార్పు చేసిన షెడ్యూల్ ప్రకారం ఫిబ్రవరి 5వ తేదీలోగా సంబంధిత అభ్యర్థులు ఫీజు చెల్లించుకోవచ్చునని సూచించారు. రూ. 100 అపరాధంతో ఫిబ్రవరి 6వ తేదీలోగా చెల్లించవచ్చునని తెలిపారు. థియరీ పరీక్షలు ఫిబ్రవరి 18వ తేదీ నుంచి నిర్వహిస్తామని వెల్లడించారు వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్ ను సంప్రదించాలని సీఈ సూచించారు.

కానిస్టేబుల్ ఉద్యోగం పేరుతో రూ.5 లక్షలు వసూలు

గుంటూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో హోం మంత్రి తానేటి వనిత సోదరుడు విజయ్ మోహన్ కుమార్ తనకు కానిస్టేబుల్ ఉద్యోగం ఇప్పిస్తానని రూ. 5 లక్షలు తీసుకొని మోసగించారని గుంటూరులోని బ్రాడీపేటకు చెందిన చెలపాక రాజ్యలక్ష్మి సోమవారం గుంటూరు జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. 2022లో కానిస్టేబుల్ నోటిఫికేషన్ వెలువడిన సమయంలో తనకు తెలిసిన వారి ద్వారా తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరులోని సత్యవతినగర్‌లో ఉంటున్న జొన్నకుర్తి విజయ్ మోహన్ కుమార్‌ను సంప్రదించానన్నారు. తన చెల్లెలు తానేటి వనిత హోం మంత్రిగా ఉందని, తప్పక కానిస్టేబుల్ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పాడన్నారు. ఇందుకుగానూ 2022 డిసెంబరు 8న తన వద్ద నుంచి రూ. 5 లక్షలు తీసుకున్నాడని వివరించారు. ఉద్యోగం రాకపోవడంతో తన డబ్బు ఇవ్వాలని అనేక సార్లు తిరిగానన్నారు. డబ్బులు కోసం విజయమోహన్ కుమార్‌ను సంప్రదిస్తే తాను ఆ డబ్బు తన సిస్టర్‌కు ఇచ్చానని, హోం మంత్రిని కలవాలని చెప్పాడని అన్నారు. హోం మంత్రి తానేటి వనితను కలిస్తే తన సోదరుడిని కలవాలని చెప్పారన్నారు. ఈ విధంగా ఒకరిపై, ఒకరు చెప్పుకున్నారని, దీంతో అప్పటి పట్టాభిపురం సీఐ విజయ్ చంద్రకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. దీనికి సంబంధించి తమ వద్ద అన్ని ఆధారాలు ఉన్నాయని, న్యాయం చేయాలనీ, తనను మోసం చేసి తీసుకున్న డబ్బును ఇప్పించాలని బాధితురాలు పోలీసు అధికారులను వేడుకున్నారు.

సకల జనుల వేదికగా మహోత్సవాలు

- బైబిల్ మిషన్ అధ్యక్షుడు జె.శామ్యూల్ కిరణ్

పెదకాకాని, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): సకల జనులకు వేదికగా బైబిల్ మిషన్ మహోత్సవాలు నిలిచాయని బైబిల్ మిషన్ అధ్యక్షుడు, మహోత్సవాల కన్వీనర్ జె.శామ్యూల్ కిరణ్ అన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎదుట మహోత్సవాల ప్రాంగణంలో 87వ బైబిల్ మిషన్ మహోత్సవాలు సోమవారం రెండో రోజుకు చేరుకున్నాయి. ప్రధానంగా మహోత్సవాల కన్వీనర్ జె.శామ్యూల్ కిరణ్ ఇచ్చిన దైవ సందేశం భక్తులలో విశ్వాసాన్ని నింపింది. ఈ సందర్భంగా యేసు క్రీస్తు చేసిన అద్భుతాలను వివరించారు. ఆనాటి యెరికో పట్టణంలో అంధత్వం కలిగిన వ్యక్తి తనకు చూపు ప్రసాదించమని విశ్వాసంతో ప్రార్థించగా, అతని జీవితంలో ఏసుక్రీస్తు ప్రభువు అద్భుత కార్యాలు చేసినట్లు వివరించారు. తొలుత తూర్పుగోదావరి జిల్లా సంగీత బృందం ప్రత్యేక క్రైస్తవ గీతాలు ఆలపించారు. బైబిల్ మిషన్ జాయింట్ సెక్రటరీ డి.సుధాకర్, కె.ఏసురత్నం, ఎన్. సత్యంబాబు, మహిమాకర్షణ కుమార్, సీహెచ్ షాలేము శరత్ తదితరులు దైవ సందేశాలు అందించారు. మహోత్సవాల కన్వీనర్ జె.శామ్యూల్ కిరణ్, వైస్ ప్రెసిడెంట్ పి.జాన్ దేవదాసు, సెక్రటరీ కె.ప్రశాంత్ కుమార్, జాయింట్ సెక్రటరీలు డి.సుధాకర్, జె.ఆగమనరావు, ఎం.సజీవరావు, ఫాదర్ ఎం.దేవదాసు, గవర్నింగ్ బాడీ సభ్యుల సారధ్యంలో వివిధ కమిటీల కృషితో ఉత్సవాలు రెండో రోజు కొనసాగాయి.



మహోత్సవాలకు హాజరైన భక్తులు

హాజరైన ప్రముఖులు

బైబిల్ మిషన్ మహోత్సవాలకు సోమవారం వేమూరు ఎమ్మెల్యే ఆనంద్ బాబు, రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మద్దిరాల ఇమ్మానుయేలు (మ్యాని) తదితరులు హాజరయ్యారు.

నేటి షెడ్యూల్ ఇలా..

బైబిల్ మిషన్ మహోత్సవాల్లో భాగంగా మంగళవారం తెల్లవారుజామున ధ్యానం, కృష్ణా జిల్లా సంగీత బృందం క్రైస్తవ కీర్తనల ఆలాపన, మహోత్సవాల కన్వీనర్ జె.శామ్యూల్ కిరణ్, వైస్ ప్రెసిడెంట్ పి.జాన్ దేవదాసు, జాయింట్ సెక్రటరీ జె.ఆగమనరావు, సాయంత్రం జె.వినోద్ కుమార్, పాస్టర్లు జి.శామ్యూల్, వి.సతీష్ బాబు తదితరులు దైవ సందేశాలు అందిస్తారు.

'పరిష్కారమే ఎజెండా'తో మనోహర్ పాదయాత్ర

- 'అక్షరం అండగా... పరిష్కారమే అజెండాగా' స్ఫూర్తితో ఒకే రోజు ప్రారంభం
- ఇంటింటికీ తిరిగి సమస్యలు తెలుసుకుంటూ..
- అధికారుల అక్రమాలపై సీరియస్

తెనాలి, జనవరి 27, (ఆంధ్రజ్యోతి): ఇంటింటికీ తిరిగారు... జనం సమస్యలు తెలుసుకున్నారు. అదే సమయంలో ఆయా వార్డుల్లో ఏళ్లతరబడి పరిష్కారం కాని సమస్యలపైనా దృష్టి పెట్టారు. సాధ్యమైన వాటికి అప్పటికప్పుడు పరిష్కారం చూపగా, దీర్ఘకాల సమస్యలకు ఒక నిర్దిష్ట సమయాన్ని కూడా అప్పుడే కేటాయించారు. ఇదంతా 'ఆంధ్రజ్యోతి' చేపట్టిన 'అక్షరం అండగా... పరిష్కారమే అజెండాగా' కార్యక్రమం స్ఫూర్తితో అదే రోజు మొదలు పెట్టడం సంతోషంగా ఉందంటూ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెనాలి పట్టణంలోని వార్డుల్లో సోమవారం పర్యటించారు. మొదట ఐతానగర్‌లోని పేరంటాళ్లమ్మ ఆలయంలో పూజలు చేశారు. తర్వాత 1, 2 వార్డుల్లో పర్యటించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి మాతోపాటు 'ఆంధ్రజ్యోతి' కూడా ముందుకు రావటం సంతోషంగా ఉందన్నారు. ఎప్పుడో మొదలు పెడదామనుకున్న కార్యక్రమం రాష్ట్రంలోని పరిస్థితుల దృష్ట్యా వాయిదా పడుతూ వచ్చిందనీ, అయితే 'ఆంధ్రజ్యోతి' రాష్ట్ర వ్యాప్తంగా సమస్యల పరిష్కారం కోసం వినూత్న కార్యక్రమం చేపట్టిన రోజునే మొదలు పెట్టడం ఆనందంగా ఉందన్నారు. ప్రజాప్రతినిధులతో పాటు మీడియా కూడా తోడుంటే మరింత సమర్థంగా పరిష్కారం చూపగలమన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేసే పత్రికలతో కలిసి నడవటానికి కూటమి ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందన్నారు. ఆయన ఇంటింటికీ తిరుగుతూ జనం వ్యక్తిగత సమస్యలతోపాటు, కాలనీల సమస్యలపైనా దృష్టిపెట్టారు. ఎక్కువగా ఇళ్లు, రేషన్ కార్డుల వంటి వ్యక్తిగత అంశాలు ఆయన ముందుకు వస్తే, ఎక్కువ మంది టిడ్కో ఇళ్లు, మురుగు కాల్వలు, వీధి దీపాల సమస్యలపై ఏకరవు పెట్టారు. ఆయనతోపాటు పర్యటనలో రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి, ఇతర జనసేన, టీడీపీ నాయకులు, ఆయా వార్డుల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. తర్వాత విలేకరులతో మంత్రి మనోహర్ మాట్లాడారు. తెనాలి పట్టణాన్ని ఒక మోడల్ టౌన్‌గా తీర్చిదిద్దాలనే ఆలోచనతో ఉన్నామని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జగనన్న కాలనీల పేరుతో ఇళ్ల స్థలాల పంపిణీ, ఇళ్ల నిర్మాణం వంటివాటిలో స్కామ్ జరిగిందనీ, తెనాలిలో భారీ స్కామే జరిగిందని, రూ. వందల కోట్లు వెచ్చించి భూముల కొనుగోలుకు చూపిన శ్రద్ధ, కనీస వసతులు కల్పించటంలో చూపలేదన్నారు. ఈ కుంభకోణంపై విజిలెన్స్ విచారణ జరుగుతోందన్నారు. ఇకపై నియోజకవర్గం మొత్తం పర్యటించి సమస్యలు గుర్తించి వాటి పరిష్కారానికి ఒక ప్రణాళిక రూపొందించుకుని నిర్ణీత సమయంలో పరిష్కరించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.



ఐతానగర్‌లో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి మనోహర్, పక్కన రాజకుమారి



డ్రగ్స్‌తో భవిష్యత్తు అంధకారం

- ఈగల్ ఐజీ ఆకె రవికృష్ణ

తాడేపల్లి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు డ్రగ్స్‌కు బానిసలు కాకూడదని, వారికి దూరంగా ఉండాలని డ్రగ్స్‌కు అలవాటు పడితే వారి భవిష్యత్తు అంధకారమేనని ఈగల్ ఐజీ ఆకే రవికృష్ణ అన్నారు. సోమవారం వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీలో డ్రగ్స్ నియంత్రణపై ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన ఈగల్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఐజీ రవికృష్ణ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు దృష్టిలో పెట్టుకుని డ్రగ్స్ నియంత్రణలో ప్రతి ఒక్కరూ తమ సహకారం అందించాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా డ్రగ్స్‌పై అవగాహన సదస్సులో వారిని కూడా ఈగల్ శాఖలో భాగస్వామ్యం చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. నేరాలు జరిగిన తరువాత కేసులు కట్టడం కంటే నేరాలు నియంత్రించడం ముఖ్యమన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను మాదక ద్రవ్యాలు లేకుండా తీర్చిదిద్దేందుకు ప్రతి విద్యార్థి ఈగల్‌కు బ్రాండ్ అంబాసిడర్ అన్నారు. ఎవరైనా మాదక ద్రవ్యాలబారిన పడితే టోల్ నెం.1972కు తెలిపితే బాధితులకు కౌన్సిలింగ్ ఇచ్చి కాపాడతామన్నారు. గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు బానిసలు అయితే వారి భవిష్యత్తు ప్రశ్నార్థకమవుతుందన్నారు. గంజాయి కేసులో అరెస్టు అయినవారు నేరస్తులుగా జీవితకాలం పాటు గుర్తింపు కలిగి ఉంటారన్నారు. ఈగల్ ఎస్పీ నగేష్, నార్త్ సబ్ డివిజన్ డీఎస్పీ మురళీకృష్ణ, తాడేపల్లి సీఐ కల్యాణ్‌రాజు, కేఎల్‌యూ రిజిస్ట్రార్ సుబ్బారావు, డీన్‌లు డాక్టర్ కేఆర్ ఎస్ ప్రసాద్, హబీబుల్లా ఖాన్, అసోసియేట్ డీన్ డాక్టర్ శ్రీధర్, ఎన్‌సీసీ లెఫ్టినెంట్ పావని విద్యార్థులు పాల్గొన్నారు.



కేఎల్‌యూలో డ్రగ్స్‌పై అవగాహన సదస్సులో ఈగల్ ఐజీ రవికృష్ణ, ఎస్పీ నగేష్, జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

పాదయాత్రతో చరిత్రను సృష్టించిన నారా లోకేష్

గుంటూరు(తూర్పు), జనవరి 27(ఆంధ్రజ్యోతి): యువగళం పేరుతో నారా లోకేష్ చేపట్టిన పాదయాత్ర రాష్ట్రంలో సరికొత్త చరిత్ర సృష్టించిందని పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. యువగళం పాదయాత్ర రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా గుంటూరు నవభారత్ నగర్‌లో క్యాంపు కార్యాలయంలో కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాదయాత్రతో లోకేష్ పార్టీకి పూర్వ వైభవాన్ని తెచ్చారన్నారు. ఆయన సమర్థవంతమైన నాయకత్వంతో రానున్న రోజుల్లో రాష్ట్రాన్ని మరింతగా అభివృద్ధి చేయగలుగుతారనే నమ్మకం ప్రతి ఒక్కరిలో ఉందన్నారు. యువగళం పాదయాత్రలో రాష్ట్రానికి పరిశ్రమలను తెచ్చి యువతకు ఉద్యోగాల కల్పనకు కృషి చేస్తామని ఇచ్చిన మాటను నిలబెట్టేందుకు లోకేష్ కృషి చేస్తున్నాడని అన్నారు. సీఎం చంద్రబాబు దావోస్ పర్యటన విజయవంతం కావడమే కాకుండా ప్రపంచ ఆర్థిక సదస్సులో ఏపీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందన్నారు. 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలనే లక్ష్యంగా దావోస్‌లో పర్యటించారని అన్నారు. దావోస్ నడి వీధుల్లో సీఎం చంద్రబాబు, ఐటీ మంత్రి నారా లోకేష్ పడిన శ్రమ సత్ఫలితాలనిస్తున్నాయన్నారు. పెట్టుబడులు పెట్టేందుకు ఆంధ్రప్రదేశ్ అనువైన రాష్ట్రమని చెప్పి కంపెనీలను ఏర్పాటు చేసేలా ఆహ్వానించారన్నారు. ఇప్పటికే రాష్ట్రానికి రూ.5 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులతో సుమారు 50 కంపెనీలు రాష్ట్రానికి వచ్చాయన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న భాష్యం ప్రవీణ్, పాల్గొన్న కూటమి నాయకులు

రెస్టారెంట్ ధ్వంసంపై ఆందోళన

కొల్లూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): అర్ధరాత్రి తమ రెస్టారెంట్‌ను ధ్వంసం చేశారని, ఇది స్థానిక టీడీపీ నాయకుని నిర్వాకమని బాధితులు ఆరోపిస్తూ ఆందోళనకు దిగారు. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కొల్లూరులో ఈనాడు రెస్టారెంట్ నిర్వహిస్తున్న గిరి కుమారస్వామి అనే వ్యక్తికి ఆదివారం అర్ధరాత్రి 12 సమయంలో టీడీపీ నాయకుడు కనగాల మధుసూదన ప్రసాద్ పలుమార్లు ఫోన్ చేసి దుర్భాషలాడాడని, కొద్ది సేపటి తరువాత వచ్చిన తన బావ పోతురాజు అతనికి ఫోన్ చేసి ఎందుకు ఫోన్ చేశావని అడుగగా మళ్లీ అదేవిధంగా దుర్భాషలాడటంతో పాటు రెస్టారెంట్‌ను కూడా ధ్వంసం చేస్తామని, చంపుతామని బెదిరింపులకు పాల్పడ్డాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. సోమవారం ఉదయం రెస్టారెంట్ వద్దకు వచ్చి చూడగా పూలకుండీలు, క్యాష్ కౌంటర్, అద్దాలు, ఇతర సామగ్రిని పెద్ద బండరాయితో పగులగొట్టడం గుర్తించామని, ఇది ఆ నాయకుని పనేనంటూ తన బంధువులతో కొల్లూరు బస్టాండ్ సెంటర్‌లో బైఠాయించి రాస్తారోకోకు దిగాడు. ఇటీవల ప్రభుత్వం మద్యం దుకాణాల కేటాయింపునకు టెండర్లు ఆహ్వానించిందని, రెండు దుకాణాలకు సంబంధించి తాము కూడా రెండు టెండర్లు వేశామని, ఆ రెండు టెండర్ నోటీసులు కూడా దౌర్జన్యంగా తీసేసుకున్నారని ఆరోపించారు. ఆందోళన చేస్తున్న సమాచారం అందుకున్న ఎస్ఐ ఏడుకొండలు తన సిబ్బందితో బస్టాండ్ సెంటర్‌కు వచ్చి బాధితుడితో పాటు ఆందోళన చేస్తున్న వారితో చర్చించారు. న్యాయం చేస్తానని చెప్పినప్పటికీ బాధితుడు వినలేదు. ఎస్ఐ నచ్చజెప్పి ఆందోళన విరమింపజేశారు. బాధితుడు ఫిర్యాదు మేరకు డాక్టర్ కనగాల మధుసూదనప్రసాద్, అతని అనుచరులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



రోడ్డుపై బైఠాయించిన రెస్టారెంట్ యజమాని, బంధువులు

'గ్రీన్ గ్రేస్' అక్రమాలను అరికట్టాలి

- డీఆర్ఎంకు నివేదించిన పొన్నూరు ఎమ్మెల్యే నరేంద్ర

గుంటూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): గ్రీన్ గ్రేస్ అపార్ట్‌మెంట్స్ యాజమాన్యం తప్పుడు పద్ధతిలో భవన నిర్మాణ అనుమతులు, ఎన్‌వోసీలు పొందాలని ప్రయత్నిస్తుందని పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ఆరోపించారు. సోమవారం సాయంత్రం ఎమ్మెల్యే నరేంద్ర పట్టాభిపురంలోని రైల్‌వికాస్ భవన్‌కు వెళ్లి డీఆర్ఎం ఎం.రామకృష్ణతో సమావేశమై పలు అంశాలను ఆయనకు నివేదించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నరేంద్ర మాట్లాడుతూ గ్రీన్ గ్రేస్ యాజమాన్యం అక్రమాలను గమనించి ప్రజలకు అన్యాయం జరగకుండా చూడాలన్నారు. భవిష్యత్తులో ఎలాంటి ప్రమాదాలు జరిగినా వాటికి బాధ్యత రైల్వేదే అవుతుందని హెచ్చరించారు. గతంలో రైల్వే నుంచి ఆదిత్య ఇన్‌ఫ్రా పేరుతో ఐదు ఫ్లోర్ల అపార్ట్‌మెంట్‌నకు అనుమతులు పొంది తదనంతరం ఎలాంటి అనుమతులు లేకుండా 15 అంతస్తుల నిర్మాణం చేసినట్లు వివరించారు. దీనిపై సరైన నిర్ణయం తీసుకోకపోతే అమాయకులైన ప్రజలు నష్టపోతారని తెలిపారు. గుంటూరు నగర మాస్టర్ ప్లాన్‌లో ఉన్నటువంటి 60 అడుగుల రోడ్డును రైల్వే, జీఎంసీ కలిసి అప్రూవ్ చేసినటువంటి ప్లాన్‌లో చూపించలేదని అన్నారు. రైల్వే డీఆర్ఎం రామకృష్ణ మాట్లాడుతూ తాము ఇప్పటి వరకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని, రైల్వే నిబంధనలకు వ్యతిరేకంగా ఎలాంటి ఎన్‌వోసీలు ఇవ్వబోమని స్పష్టం చేశారు. ఆదిత్య ఇన్‌ఫ్రా పేరుతో గతంలో ఇచ్చిన ఎన్వోసీని రద్దు చేశామని తెలియజేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఎన్నిసార్లు ఎన్‌వోసీ కోసం దరఖాస్తు చేసినప్పటికీ అనుమతులు ఇవ్వమని చెప్పారు. జీఎంసీ మాస్టర్ ప్లాన్‌లోని 60 అడుగుల రహదారి రైల్వే వారిది కాదని, అది జీఎంసీ పరిధిలోనిదే అని డీఆర్ఎం చెప్పారు. త్వరలోనే గుంటూరు నాలుగు లైన్లుగా పరిణితి చెందబోతుందని, నిబంధనలకు విరుద్ధంగా ఉంటే జరిగే ప్రమాదాలకు ప్రజలు నష్టపోతారని, ప్రజలకు ప్రభుత్వానికి నష్టం చేకూర్చకుండా చూడడమే తమ బాధ్యతని తెలిపారు.



డీఆర్ఎంతో సమావేశమైన ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్

బీసీల బంధువు టీడీపీ

(5వ పేజీ తరువాయి)

టీడీపీతోనే సాధ్యమైందన్నారు. పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి మాట్లాడుతూ రాజకీయ కుటుంబ నేపథ్యం లేకపోయినా తనకు పశ్చిమ టికెట్ ఇచ్చి బీసీ బిడ్డను అసెంబ్లీకి పంపిన ఘనత టీడీపీ,సీఎం చంద్రబాబుకు దక్కుతుందన్నారు. విజనరీ నాయకత్వం కలిగిన చంద్రబాబు సారధ్యానికి బీసీలు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. సభకు అధ్యక్షత వహించిన ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి రాగానే చరిత్రాత్మక నిర్ణయాలతో అభివృద్ధి, సంక్షేమంలో ముందుకెళుతుందన్నారు. అమరావతి రాజధాని పునర్ నిర్మాణంతో పాటు రైతుల బకాయిలు రూ. 2 వేల కోట్లు విడుదల చేయటం, బీసీ సబ్ ప్లాన్ వంటి అనేక నిర్ణయాలు తీసుకుంటున్నారన్నారు. అనంతరం కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, మంత్రులు అచ్చెన్నాయుడు, సవిత, కొండపల్లి శ్రీనివాస్, కొలుసు పార్థసారధి, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు బూర్ల రామాంజనేయులు, నసీర్ అహ్మద్, తెనాలి శ్రావణ్‌కుమార్, నగర అధ్యక్షుడు, ఏపీ ఐడీసీ చైర్మన్ డేగల ప్రభాకర్, వేములకొండ శ్రీనివాసరావు పలువురు నాయకులున్నారు.



పూలదండతో సన్మానం

గుత్తికొండ అటవీప్రాంతంలో యువతిపై దాడి

పిడుగురాళ్ళ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): గుత్తికొండ అటవీ ప్రాంతంలో ఏకాంతంగా మాట్లాడుకునేందుకు వెళ్లిన ఓ జంట ఆ తరువాత మాట మాట పెరగడంతో, యువకుడు యువతిపై దాడికి పాల్పడిన సంఘటన సోమవారం పల్నాడు జిల్లా గుత్తికొండ సమీపంలోని అటవీ ప్రాంతంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నకరికల్లు గ్రామానికి చెందిన యువతి బీఫార్మసీ చదువుతుంది. యువతికి కారంపూడికి చెందిన మల్లికార్జునతో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయంతో వీరిద్దరు తరచూ గుత్తికొండ అటవీ ప్రాంతానికి వెళ్లి వస్తుంటారని సమాచారం. సోమవారం కూడా గుత్తికొండ అటవీ ప్రాంతానికి వెళ్లారు. యువతి వేరే వారితో ఫోన్‌లో మాట్లాడుతుందన్న అనుమానంతో వారిద్దరి మధ్య మాట మాట పెరిగి వాగ్వాదం జరిగింది. దీంతో యువతిపై దాడికి పాల్పడటంతో ఎడమకాలుకు తీవ్ర గాయమైంది. సమాచారం తెలుసుకున్న యువతి కుటుంబ సభ్యులు వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. పిడుగురాళ్ల పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు

రైలు కిందపడి విద్యార్థిని ఆత్మహత్య

పెదకాకాని, జనవరి 27(ఆంధ్రజ్యోతి): రైలు కిందపడి విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న సంఘటన పెదకాకానిలో వెలుగు చూసింది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. పెదకాకాని గ్రామానికి చెందిన వేములకొండ హారిక(17) అనే విద్యార్థిని నారాకోడూరు శివారులోని ఓ ప్రైవేట్ కళాశాలలో పాలిటెక్నిక్ చదువుతోంది. అమ్మమ్మ వాణి, తాతయ్య కొండలరావు వద్ద ఉంటూ కళాశాలకు వెళ్తుంది. ఆర్నెల్ల క్రితం తాతయ్య కొండలరావు అనారోగ్యంతో మృతి చెందాడు. అప్పటి నుంచి హారిక మానసిక పరిస్థితి సక్రమంగా లేకపోవడంతో కళాశాలకు కూడా అప్పుడప్పుడు వెళ్లడం లేదు. సోమవారం ఉదయం గుంటూరు వైపు నుంచి విజయవాడ వెళుతున్న రైలు బండి కింద పడి హారిక ఆత్మహత్య చేసుకుంది. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకున్నారు మృతురాలు వేములకొండ హారికగా గుర్తించారు. రైల్వే పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.00
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	125,134,145
చికెన్ విత్ స్కిన్	236.00
చికెన్ స్కిన్ లెస్	246.00

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

యువగళం పాదయాత్ర చారిత్రాత్మకం

- ఎమ్మెల్యే యరపతినేని

పిడుగురాళ్ల, జనవరి 27(ఆంధ్రజ్యోతి): యువనేత నారా లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్ర రాష్ట్ర చరిత్ర గతినే మార్చేసిందని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 3,132 కిలోమీటర్ల పాదయాత్ర చేసిన లోకేశ్ వైసీపీకి సమాధిరాళ్లు వేశారన్నారు. నాడు పాదయాత్ర పొడవునా వెల్లువెత్తిన జన సంద్రం తెలుగుదేశంకు బలాన్ని చేకూర్చిందని, లోకేశ్ పాదయాత్ర చేయక పోయి వుంటే రాక్షస జగన్ రాష్ట్రాన్ని కబళించేవాడన్నారు. ఎన్ని ఆటంకాలు, అడ్డంకులు సృష్టించినా ధైర్యంగా పోరాడి యువగళం పాదయాత్రను లోకేశ్ పూర్తిచేశాడన్నారు. యాత్రలో చూసిన అంశాలే అజెండాగా మేనిఫెస్టోలో ప్రకటించి నేడు అమలు చేస్తున్నాడని యరపతినేని తెలిపారు. నాడు యువగళం సృష్టించిన సునామీలోనే వైసీపీ అడ్రస్ లేకుండాపోయిందని, యువగళం పాదయాత్ర టీడీపీకి, రాష్ట్రానికి నవశకం బాట చూపిందని యరపతినేని తెలిపారు.

వైస్‌చైర్మన్ ఎన్నికకు నోటిఫికేషన్

పిడుగురాళ్ల, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): పిడుగురాళ్ల పురపాలక సంఘ వైస్ చైర్మన్ ఎన్నికకు సోమవారం నోటిఫికేషన్ విడుదలైనట్లు కమిషనర్ పి.శ్రీధర్ తెలిపారు. గత ఏడాది మేలో మున్సిపల్ వైస్‌చైర్మన్ కొమ్ము ముక్కంటి మృతి చెందడంతో ఖాళీ అయిన వైస్‌చైర్మన్ పదవికి ఈ నెల 30లోపు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసి ఫిబ్రవరి 3వ తేదీన ఎన్నిక జరిగేలా చూడాలని నోటిఫికేషన్‌లో వివరించినట్లు కమిషనర్ శ్రీధర్ తెలిపారు.

ప్రజల అర్జీలను వెంటనే పరిష్కరించండి



దాచేపల్లి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ప్రజల అర్జీలను త్వరగా పరిష్కరించాలని దాచేపల్లి ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన పిడుగురాళ్ల తహసీల్దార్ జె.మధుబాబు తెలిపారు. సోమవారం దాచేపల్లిలో ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు తీసుకున్న ఆయన ఆర్‌ఐ శరత్‌బాబు, వీఆర్‌ఓలు, నౌకర్లతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో మధుబాబు మాట్లాడుతూ ఇతర పెండింగ్ ఫైల్స్‌ను కూడా త్వరలో విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామన్నారు. గతంలో పనిచేసిన దాచేపల్లి తహసీల్దార్ వైవీ కుటుంబరావును గురజాల తహసీల్దార్ కార్యాలయానికి అటాచ్‌మెంట్ చేశారు. దాచేపల్లి తహసీల్దార్ కార్యాలయంలో గత కొంతకాలంగా అధికారుల మధ్య సమన్వయం లేక ప్రజలకు ఇబ్బందులను కలుగజేసింది. ఈ దృష్ట్యా జిల్లా ఉన్నతాధికారులు పిడుగురాళ్ల తహసీల్దార్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు.

దాచేపల్లిలో రహదారి భద్రత అవగాహనా ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న ఆంధ్రా సిమెంట్స్ లిమిటెడ్ ఉద్యోగులు

దాచేపల్లి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): 36వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలలో భాగంగా ఆంధ్రా సిమెంట్స్ ఉద్యోగులు దాచేపల్లి నగర పంచాయతీలో భద్రతా అవగాహన ర్యాలీ నిర్వహించారు. సోమవారం దాచేపల్లిలోని బంగ్లా సెంటర్ నుండి కారంపూడి బస్టాండ్ వరకు ఉద్యోగులు రహదారి భద్రతపై అవగాహన కల్పిస్తూ నినాదాలు చేశారు. మానవహారం నిర్వహించి రోడ్డు భద్రత గురించి స్థానికులకు వివరించారు. ప్లాంట్ హెడ్ సుబ్బారావు మాట్లాడుతూ ప్రతి పౌరుడు రహదారి భద్రతా నియమాలను పాటించాలని కోరారు. దాచేపల్లి ఎస్‌ఐ సౌందర్‌రాజన్ మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడిపితే కఠినచర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సేఫ్టీ మేనేజర్ సంజయ్‌కుమార్ సింగ్, రామకృష్ణ, శంకరనారాయణరెడ్డి తదితరులున్నారు.

విద్యుత్ అంతరాయాన్ని తగ్గిస్తాం

● విద్యుత్‌శాఖ ఎస్‌ఈ విజయకుమార్


కొండమోడు సబ్‌స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న విద్యుత్‌శాఖ ఎస్‌ఈ పి విజయకుమార్

పిడుగురాళ్ల, జనవరి 27(ఆంధ్రజ్యో తి): విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూసేందుకు కృషి చేస్తున్నామని విద్యుత్‌శాఖ పల్నాడు జిల్లా ఎస్‌ఈ పి.విజయకుమార్ తెలిపారు.సోమవారం కొండమోడు విద్యుత్‌శాఖ కార్యాలయం లో డివిజన్ పరిధిలోని అధికారులతో స మీక్షించారు. వేసవిలో వినియోగదారుల కు నాణ్యమైన విద్యుత్‌ను అందించేలా చూడాలని సిబ్బందికి సూచించారు. మం గళవారం పిడుగురాళ్లలో రథోత్సవం సం దర్భంగా మధ్యాహ్నం ఒంటి గంట నుండి రాత్రి 7గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని ఎస్‌ఈ తెలిపారు. ఈ సమావేశంలో ఏడీఈ బి.నాగసురేష్‌బాబు, ఏఈ సైదారావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

30న చేపల చెరువు వేలం

రాజుపాలెం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని బలిజేపల్లి గ్రామంలో ఉన్న చేపలచెరువుకు ఈనెల 30వ తేదీ ఉదయం 11గంటలకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు గ్రామపంచాయతీ కార్యదర్శి మహంకాళమ్మ సోమవారం తెలిపారు. గ్రామ పరిధిలోని 201 సర్వేనెంబర్‌లో 73.92 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ చెరువులో చేపపిల్లలను వేసి పెంచుకొనేందుకు వేలం నిర్వహిస్తున్నట్లు ఆమె చెప్పారు. ఈ బహిరంగ వేలంలో పాల్గొనదలచిన వారు గంట ముందు రూ.10వేల నగదును గ్రామ పంచాయితీకి డిపాజిట్ చేయాలని చెప్పారు.

గ్రామీణ ప్రాంతాలపై నిఘా

రాజుపాలెం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామీణ ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటుచేసినట్లు రాజుపాలెం ఎస్సై వేణుగోపాల్ అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొత్తబోదనం, రాజుపాలెం, పులిచింతల పునరావాస కేంద్రాలలో ఇటీవల తరచుగా దొంగతనాలు జరుగుతున్న నేపథ్యంలో పోలీసు సిబ్బందితో పాటు డ్రోన్స్ ద్వారా నిఘా ఏర్పాటుచేసినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉండే నాయకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించాలని ఎస్సై కోరారు. ఎవరైనా కొత్త వ్యక్తులు పదేపదే సంచరించినట్లయితే స్థానిక పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

బాలకృష్ణకు పద్మభూషణ్‌పై హర్షం

సత్తెనపల్లి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): హిందూపురం ఎమ్మెల్యే, సినీనటుడు బాలకృష్ణకు కేంద్రప్రభుత్వం పద్మభూషణ్ అవార్డును ప్రకటించటం హర్షణీయమని టీడీపీ నేతలు అన్నారు. సోమవారం టీడీపీ ప్రజావేదికలో వారు విలేకరులతో మాట్లాడుతూ సినీనటుడిగా, ప్రజా సేవకుడిగా, బసవతారకం కేన్సర్ ఆసుపత్రి ఛైర్మన్‌గా ప్రజలకు సేవలందిస్తున్నారన్నారు. హర్షం వ్యక్తం చేసినవారిలో యెల్లినేడి రామస్వామి, కోమటినేని శ్రీనివాసరావు, సయ్యద్ పెదకరిముల్లా, ఆతుకూరి నాగేశ్వరరావు, పూజల వెంకటకోటయ్య, జాన్‌బాబు, దివ్వెల శ్రీనివాసరావు, హరేకృష్ణ, మస్తాన్‌వలి తదితరులు ఉన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

సత్తెనపల్లిరూరల్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ మృతిచెందాడు. మండలంలోని రామకృష్ణాపురం వద్ద ఆదివారం ఆటో-ద్విచక్రవాహనం ఢీకొన్న ఘటనలో నందిగం ఏలియ(17), నందిగం సిద్దు, వేమవరపు ఫణీంద్ర గాయపడ్డారు. వీరిని మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు ఏరియా వైద్యశాలకు తరలించగా ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతూ సోమవారం ఏలియ మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు.

సైడ్‌కాల్వల నిర్మాణానికి సర్వే

ముప్పాళ్ళ, జనవరి 27(ఆంధ్రజ్యోతి): మండలంలో సమస్యాత్మక గ్రామమైన మాదలలో సైడ్‌కాల్వల నిర్మాణానికి సోమవారం సర్వే జరుగుతుండగా గ్రామంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. గ్రామంలో గత కొన్ని నెలలుగా ఇరువర్గాల మధ్య వివాదం నడుస్తున్నది. సైడ్ కాల్వల నిర్మాణానికి సర్వే కోసం అధికారులు గ్రామంలోకి రాగా తమ కాంప్లెక్స్ ముందు పగులగొట్టడానికి వీల్లేదని అడ్డుచెప్పటంతో గతంలో సర్వే వాయిదా పడింది. అధికారులు మరలా సర్వే చేపట్టడంతో పోలీసులు ఇరువర్గాల పెద్దలతో మాట్లాడి ఎవరికి ఇబ్బందులులేకుండా కాల్వనిర్మాణానికి సర్వే చేశారు.

చంద్రబాబుపై నమ్మకంతో రాష్ట్రానికి పారిశ్రామికవేత్తల క్యూ


కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, యెల్లినేడి రామస్వామి

సత్తెనపల్లి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబునాయుడుపై నమ్మకంతోనే ప్రపంచ పారిశ్రామికవేత్తలు ఏపీలో పరిశ్రమలు పెట్టడానికి క్యూ కడుతున్నారని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. సోమవారం టీడీపీ ప్రజావేదికలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాష్ట్రంలో 20లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని చంద్రబాబునాయుడు, మంత్రి లోకేశ్ ఇచ్చిన హామీలను అమలుచేసేందుకు నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. ఈ క్రమంలో వారి దావోస్ పర్యటన విజయవంతమైందన్నారు. వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సులో చంద్రబాబునాయుడు ప్రత్యేక ఆకర్షణగా ఆంధ్రప్రదేశ్‌ను నిలిపారన్నారు. జగన్ నిర్వాకంతో అంధకారంలోకి వెళ్ళిన పారిశ్రామికరంగానికి నూతన వెలుగులు తీసుకురావటానికి వారు కష్టపడుతున్నారన్నారు.ఇప్పటికే రాష్ట్రానికి రూ.5లక్షల కోట్లకు పైగా పెట్టుబడులతో 50 కంపెనీలు వచ్చాయన్నారు. 40వేల మంది యువతకు ఉద్యోగ అవకాశాలు లభించాయన్నారు. అన్ని రంగాలను చంద్రబాబు గాడిలో పెడుతున్నారన్నారు. హామీలను అమలు చేసే దిశగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. లోకేశ్ యువగళం పాదయాత్ర రెండేళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా కన్నా, పార్టీ నాయకులు కేక్ కట్‌చేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్రనేతలు యెల్లినేడి రామస్వామి, కోమటినేని శ్రీనివాసరావు, పూజల వెంకటకోటయ్య, పల్లపాటి పెద్దిరాజు, ఆళ్ళ సాంబయ్య, సాగి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కన్నా పరామర్శ

మండలంలోని రామకృష్ణాపురంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలపాలై గుంటూరు ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతున్న విద్యార్థి వి.ఫణిని సోమవారం ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పరామర్శించారు. మెరుగైన వైద్యసేవలు అందించాలని ఆయన వైద్యులకు సూచించారు.

సరస్వతీదేవి విగ్రహావిష్కరణ

నకరికల్లు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో సరస్వతి దేవి విగ్రహాన్ని ఏర్పాటుచేయటం సంతోషకరమని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. సోమవారం నకరికల్లు పాతూరులోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటుచేసిన సరస్వతిదేవి విగ్రహాన్ని కన్నా ఆవిష్కరించారు. విగ్రహాన్ని ఏర్పాటుచేసిన బద్దుల నాగేశ్వరరావును ఆయన సత్కరించారు.

గోపిశెట్టి శ్రీరాములు కుటుంబానికి పరామర్శ

నకరికల్లులో టీడీపీ సీనియర్ నేత దివంగత గోపిశెట్టి శ్రీరాములు కుటుంబసభ్యులను ఎమ్మెల్యే కన్నా పరామర్శించారు. శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కే పుల్లారావు, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగోతు శౌరయ్య, జనసేన సత్తెనపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్ బొర్రా వెంకటఅప్పారావు, ఎంఈవో ప్రసాదు, హెచ్‌ఎం శ్రీనివాసరావు, ఈవోపీఆర్‌డీ ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదభరితంగా ప్రాంతీయ పశువైద్యశాల భవనం


రాజుపాలెంలోని ప్రాంతీయ పశువైద్యశాలలో పెచ్చులూడిన శ్లాబు, పరిశీలిస్తున్న పంచాయతీరాజ్ డీఈ శేఖర్‌బాబు

రాజుపాలెం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): రాజుపాలెం గ్రామంలో ఉన్న ప్రాంతీయ పశువైద్యశాల భవనం ప్రమాదపుటంచున్న ఉంది. భవనం శ్లాబ్ పెచ్చులూడిపడుతుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని సిబ్బంది భయాందోళన చెందుతున్నారు. రాజుపాలెంలో 2006కి ముందు పాతభవనంలో వెటర్నరీ డిస్పెన్సరీ కొనసాగించారు. ఆ సమయంలో అప్పటి మండలస్థాయి నాయకులు అప్పటి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ దృష్టికి తీసుకెళ్ళటంతో ఆయన వెంటనే శిథిలావస్థలో ఉన్న భవనాన్ని పరిశీలించి నూతన భవన నిర్మాణానికి రూ.10లక్షల నిధులు మంజూరు చేయించారు. భవన నిర్మాణం శరవేగంగా జరిగి ఉద్యోగ కార్యకలాపాలు నూతన భవనంలో కొనసాగుతూ వచ్చాయి.

వెటర్నరీ డిస్పెన్సరీ నుంచి ప్రాంతీయ పశువైద్యశాలగా...

రాజుపాలెంలో వెటర్నరీ డిస్పెన్సరీగా ఉండి చుట్టుపక్కల ఐదారు గ్రామాల్లోని పశువులకు వైద్యసేవలు చేస్తూ ఉండేవారు. 2016లో అప్పటి ప్రభుత్వం రాజుపాలెంలో ఉన్న వెటర్నరీ డిస్పెన్సరీని ప్రాంతీయ పశువైద్యశాలగా అప్‌గ్రేడ్ చేస్తూ జీవో విడుదలచేసింది. దీంతో రాజుపాలెం, బెల్లంకొండ మండలాలు ప్రాంతీయ పశువైద్యశాల పరిధిలోకి వచ్చాయి. 2006లో నిర్మించిన ఈ నూతన భవన నిర్మాణంలో నాణ్యత లోపించటంతో కొద్దికాలనికే శిథిలావస్థకు చేరింది. ఏస్థాయిలో అంటే సోమవారం పంచాయతీరాజ్ డీఈ శేఖర్‌బాబు, ఏఈ నరసింహారావులు ఈ భవనానికి మరమ్మతుల నిమిత్తం పరిశీలించేందుకు వచ్చారు. భవనం ప్రమాదకరమైన స్థితిలో ఉందని, దీనికి మరమ్మతులు అనవసరమని తేల్చి చెప్పారు. ఇదే విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ దృష్టికి తీసుకెళ్ళి నూతన భవన నిర్మాణం నిమిత్తం కలిసి కోరాలని వారు ఏడీఏ వీరయ్యకు సూచించారు. ఈ భవన నిర్మాణం అధునాతనంగా పాడి రైతులను దృష్టిలో ఉంచుకొని నిర్మించాలని రాజుపాలెం, బెల్లంకొండ మండలాల రైతులు కోరుతున్నారు.


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న చైర్మన్ నరసింహారావు

మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన మున్సిపల్ చైర్మన్

మాచర్లటౌన్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శుద్ధగుంతలలో గల జిల్లా పరిషత్ బాలురోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని సోమవారం మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని నిర్వాహకులకు సూచించారు. అలాగే సచివాలయాన్ని సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

డ్రెయినేజీ పనులకు శంకుస్థాపన

అచ్చంపేట. జనవరి 27 (ఆంధ్రజ్యోతి): అచ్చంపేటలోని అచ్చమ్మ పేరంటాళ్ళ అమ్మవారి ఆలయం నుంచి నీలేశ్వరపాలెం రోడ్డులోని వాగువరకు డ్రెయినేజీ పనులకు సోమవారం ఎంపీడీవో కె శ్రీనివాసరావుతో పాటు టీడీపీ నాయకులు సోమవారం శంకుస్థాపన చేశారు. రూ.30లక్షల పంచాయతీ గ్రాంట్లతో మొదటి విడతగా రూ.15లక్షల నిధులతో పనులకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం, వెనిగళ్ళ కోటయ్య, బత్తుల శ్రీనివాసరావు, మచ్చా నవీన్, సర్పంచ్ జానీ, కోట చంటి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల హృదయ స్పందనకు అద్దంపట్టిన యువగళం

● టీడీపీ మండల అధ్యక్షుడు అర్తిమళ్ళ రమేష్

పెదకూరపాడు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): లోకేశ్ తలపెట్టిన యువగళం పాదయాత్ర ప్రజల హృదయ స్పందనకు అద్దం పట్టిందని టీడీపీ మండలఅధ్యక్షుడు అర్తిమళ్ళ రమేష్ అన్నారు. టీడీపీ మండల కార్యాలయంలో సోమవారం లోకేశ్ యువగళం పాదయాత్ర రెండు సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. యువగళానికి ఆటంకాలు సృష్టించినా, అడ్డుకోవాలని కుట్రలు పన్నినా జనమే బలగమై లోకేశ్ యాత్ర టీడీపీ విజయానికి దోహదపడిందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బెల్లంకొండ రామగోపాలరావు, టీడీపీ మండల నేతలు మక్కెన సాగర్, నెల్లూరి మల్లికార్జున్, మద్దినేని వెంకట సత్యనారాయణ, ఏటుకూరి సురేష్, జాగర్లమూడి రఘు, షేక్ అజ్మల్లా, మలాల్ రఫీ, షేక్ మస్తాన్ షరీఫ్, షేక్ ముంతాజ్, గంగినేని లీలావతి, కావూరి సుజీత తదితరులు పాల్గొన్నారు.

యువగళం పాదయాత్ర కొనసాగించిన ఘనత లోకేశ్‌దే

బెల్లంకొండ, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ఎన్ని అడ్డంకులు, అవరోధాలు వచ్చినా యువగళం పాదయాత్ర కొనసాగించి టీడీపీ విజయానికి కృషి చేసిన మంత్రి లోకేశ్‌కు అభినందనలు తెలుపుతున్నట్లు టీడీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధానకార్యదర్శి పీఎస్‌కే మస్తాన్ షరీఫ్ పేర్కొన్నారు. సోమవారం బెల్లంకొండ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దావోస్ పర్యటన విజయవంతం కావడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బెల్లంకొండ పార్టీ కార్యాలయంలో నాయకులు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు నల్లమేకల లక్ష్మీనారాయణ, టీడీపీ నాయకుడు అక్కల వెంకటరామిరెడ్డి, బెల్లంకొండ సర్పంచ్ జ్యోతి సముద్రం, మాజీ ఎంపీటీసీ గుడిసె కొండయ్య, ప్రసాదరావు, వెంకటరావు, ఎన్ పిచ్చయ్య, సయ్యద్ జానీ, తెలుగు యువత నాయకుడు సలాం, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పీఎస్‌కే

నేటి నుంచి రెండు తెలుగు రాష్ట్రాల స్థాయిలో ఎడ్ల పోటీలు

రెంటచింతల, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): కానుకమాత చర్చి 175 సంవత్సరాల వేడుకలను పురస్కరించుకుని రెంటచింతలలోని సెయింట్ జోసఫ్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నుంచి వారంరోజుల పాటు రెండు తెలుగు రాష్ట్రాల స్థాయిలో ఎడ్ల బండ లాగుడు పోటీలను నిర్వహించనున్నట్లు కానుకమాత కోడెగిత్తల నిర్వాహకులు చెప్పారు. 6 విభాగాల్లో పోటీలుంటాయని, ఒక్కో విభాగానికి 9 రకాల బహుతులుంటాయన్నారు. రూ.16లక్షల విలువైన బహుమతులు విజేతలకు ఇస్తామన్నారు. ఉదయం 9.10 గంటలకు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పోటీలు ప్రారంభిస్తారన్నారు. ముళ్ళుకర్ర వాడకూడదని, ఎడ్ల తోకలు విరవరాదని ఒక్కో జతకు ఏడుగురు ఉండొచ్చన్నారు.

శివరాత్రి ఏర్పాట్లపై నేడు సమీక్ష

రెంటచింతల, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): పల్నాట ప్రముఖ శైవక్షేత్రం సత్రశాలకు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి మంగళవారం రానున్నట్లు టీడీపీ మండల అధ్యక్షుడు చపారపు అబ్బిరెడ్డి, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు సుమంత్‌రెడ్డి చెప్పారు. ఫిబ్రవరి 26న నిర్వహించబోయే మహాశివరాత్రి ఏర్పాట్లను గురించి అధికారులతో సమీక్షించనున్నారు.

ఆటోడ్రైవర్లు బాధ్యతగా వ్యవహరించాలి

ఎస్‌ఐ మహ్మద్ షఫి


ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్‌ఐ మహ్మద్ షఫి

మాచర్ల రూరల్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణకు ఆటో డ్రైవర్లు బాధ్యతగా వ్యవహరించాలని విజయపురిసౌత్ ఎస్‌ఐ మహ్మద్‌షఫి అన్నారు. సోమవారం రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టు వద్ద ఆటోడ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. పరిమితికి మించి ఆటోల్లో ప్రయాణికులను ఎక్కిస్తే కఠినచర్యలు తీసుకుంటామన్నారు. మద్యం తాగి ఆటోలు నడపడం చట్టరీత్యా నేరమన్నారు. ఎస్‌ఐ వెంట సిబ్బంది సోమ్లానాయక్ ఉన్నారు.

ఇర్మియ మృతి పార్టీకి తీరని లోటు: ముప్పాళ్ల

క్రోసూరు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): సీపీఐ నాయకుడు పీ ఇర్మియ మృతి పార్టీకి తీరనిలోటని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు అన్నారు. సోమవారం మండలంలోని దొడ్లేరులో ఇర్మియా మృతదేహం వద్ద ఆయన ఘనంగా నివాళులర్పించారు. దొడ్లేరు గ్రామంలో జరిగిన అంత్యక్రియల్లో ముప్పాళ్ళ నాగేశ్వరరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి మారుతీవరప్రసాదు, కాసా రాంబాబు, మునగోటి శ్రీనివాసరావు, కె.శరత్, ఆర్.శేషయ్య, తాండవకృష్ణ, పవన్ కుమార్, చిన జాన్ సైదా తదితరులు పాల్గొన్నారు.

● సత్తెనపల్లి: సత్తెనపల్లి నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి, ఆనంద్ ఎడ్యుకేషన్ సొసైటీ డైరెక్టర్ పి.ఇర్మియా(62) సోమవారం గుండెపోటుతో మృతిచెందాడు. ఆయన మరణవార్త తెలుసుకున్న సీపీఐ నాయకులు నరిశేటి వేణుగోపాల్, తిరుపతిరావు, కంబాల శ్రీనివాస్, డీఆర్ మస్తాన్, సీపీఎం నాయకులు గద్దె చలమయ్య, ధరణికోట విమల, కట్టా శివదుర్గారావు, పెండ్యాల మహేష్, వివిధ ప్రజాసంఘాలు, ఎంఆర్‌పీఎస్ నేతలు ఆయన మృతదేహానికి నివాళులర్పించారు.

రైలు పట్టాలపై మృతదేహం లభ్యం

మాచర్లటౌన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కంభంపాడు శివారు జింకల బోడు వద్ద రైల్వే ట్రాక్‌పై సోమవారం మృతదేహం లభ్యమైంది. మాచర్లలోని బురుజు సెంటర్లో నివాసముంటున్న వడ్లమాను నవీను (26) స్వీట్లు, తినుబండారాలు విక్రయించుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. నవీనుకు మూడేళ్ల క్రితం విజయవాడకు చెందిన స్రవంతితో వివాహమైంది. కొంతకాలంగా ఉమ్మడి కుటుంబానికి సంబంధించిన కలహాలతో మనస్థాపం చెందిన నవీను ఆదివారం రాత్రి సమయంలో ఇంట్లో నుంచి బయటకు వెళ్లిపోయాడు. సోమవారం ఉదయం జింకలబోడు వద్ద రైల్వే పట్టాలపై విగతజీవిగా పడి ఉన్నాడు. రైలు ఢీకొని మృతిచెందినట్లు భావిస్తున్నారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని భార్య స్రవంతి, కుటుంబసభ్యులకు అప్పగించారు.


చెరుకుంపాలెంలో ప్రభుత్వం మంజూరు చేసిన డీకే పట్టాలకు పొజిషన్ చూపించాలంటూ భూములను పరిశీలిస్తున్న రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయ్య

డీకే పట్టాలకు పొజిషన్ చూపించాలి

● రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయ్య

అచ్చంపేట. జనవరి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెరుకుంపాలెంలో 1993లో డీకే పట్టాలు ఇచ్చిన రైతులకు తక్షణమే పొజిషన్ చూపించాలని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వీ కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తాళ్ళచెరువు రెవెన్యూ పరిధిలోని చెరుకుంపాలెం గ్రామ రైతులతో పాటు జిల్లా వ్యవసాయ కార్మికసంఘ ప్రధానకార్యదర్శి గంజిమాల రవిబాబు, జిల్లా కమిటీ సభ్యులు కలిసి డీకే పట్టా భూములను సోమవారం పరిశీలించారు. తాళ్ళచెరువు రెవెన్యూ సర్వే నెం.320 నుండి 337వరకు సుమారు 100మంది నిరుపేద రైతు కూలీలకు అప్పటి మంత్రి కన్నా లక్ష్మీనారాయణ డీకే పట్టాలు పంపిణీ చేశారు. భూమి సాగుచేసుకుంటున్న 60మంది రైతులకు ఆన్‌లైన్ నమోదుకాలేదని కృష్ణయ్య తెలిపారు. మరో 40మంది రైతులు వ్యవసాయేతర పంటలు పండిస్తుంటే రెండు సంవత్సరాలుగా అటవీశాఖ అధికారులు మా భూముల్లోకి రానివ్వటం లేదని రైతులు తమ గోడును రైతుసంఘం నాయకుల వద్ద మొరపెట్టుకున్నారు. సమస్యను తక్షణమే పరిష్కరించకుంటే తహసీల్దార్, కలెక్టర్ కార్యాలయాల ముందు ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా రావెళ్ళ వెంకటేశ్వర్లు, ఆర్ మనుమంతరావు, కేకే రెడ్డి, వీరితో పాటు బాధిత రైతులు ఉన్నారు.

అప్రైజర్ మాయం చేసిన బంగారాన్ని ఇప్పించాలని రైతుల ధర్నా


రైతులతో మాట్లాడుతున్న పోలీసులు

క్రోసూరు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని దొడ్లేరు చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకులో రెండేళ్ల క్రితం బ్యాంక్ అప్రైజర్ చేతివాటంతో మాయమైన బంగారాన్ని ఇప్పించాలని డిమాండ్ చేస్తూ బాధిత రైతులు సోమవారం బ్యాంక్ ఎదుట బైఠాయించారు. అధికారులను బ్యాంకులోకి వెళ్ళకుండా గేటుకు తాళం వేశారు. ధర్నాలో భాగంగా బ్యాంక్ వద్ద వంటావార్పు నిర్వహించారు. మొత్తం 500మందికి చెందిన బంగారం మాయం కాగా ఇప్పటివరకు 320మందికి డబ్బు ఇప్పించామని బ్యాంక్ మేనేజర్ శివశంకర్ తెలిపారు. మరో 120మందికి సెటిల్‌మెంట్ జరిగిందని, వారికి కూడా బంగారం ఇస్తామని చెప్పారు. బాధిత రైతులు బ్యాంక్ ఎదుట ఆందోళనకు దిగటంతో పోలీసులు రంగప్రవేశం చేశారు. అధికారుల నుంచి తమకు స్పష్టమైన హామీ లభిస్తేగాని ఆందోళన విరమించేది లేదని రైతులు తేల్చి చెప్పారు. పెదకూరపాడు సీఐ పత్తిపాటి సురేష్, క్రోసూరు ఎస్‌ఐ నాగేందరరావు పలుమార్లు బ్యాంక్ అధికారులు, రైతులతో చర్చలు జరిపారు. బంగారమైనా ఇప్పిస్తాం... లేకపోతే గ్రాముకు రూ 6వేల చొప్పున డబ్బు చెల్లిస్తామని బ్యాంక్ మేనేజర్ చెప్పారు. రోజుకు 15మంది బాధితులకు డబ్బు ఇప్పించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.దీంతో రైతులు శాంతించి ఆందోళన విరమించారు.

క్రోసూరులో లోకేశ్ చిత్రపటానికి పాలాభిషేకం

క్రోసూరు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): మంత్రి నారా లోకేశ్ పాదయాత్ర ప్రారంభించి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం క్రోసూరులోని ఎన్‌టీఆర్ విగ్రహం వద్ద ఆయన చిత్రపటానికి టీడీపీ నాయకులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా భారీ కేక్ కట్‌చేశారు. పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా లోకేశ్ కృషిచేయటం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు. మాజీ మార్కెట్ యార్డు చైర్మన్‌లు కాంధ్రు కాశయ్య, ఏపూరి నాగేశ్వరరావు, మాజీ ఎంపీపీ అనుముల వెంకటరామిరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు గుడిపాడు బాషా, తెలుగు రైతు అధ్యక్షుడు తోక వెంకటరావు, దుద్దుల యోహాన్, నలజాల కోటి, షేక్ సలాం, పరిశ రాంబాబు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఉమ్మడి గుంటూరు జిల్లా స్త్రీ పురుషుల ఖోఖో జట్ల ఎంపిక

నకరికల్లు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా ఖోఖో అసోసియేషన్ నకరికల్లు వంగా వెంకటరెడ్డి జడ్పీ హైస్కూల్లో స్త్రీ, పురుషుల ఖోఖో జట్లను ఆదివారం ఎంపికచేసినట్టు అసోసియేషన్ సెక్రటరీ చింతా పుల్లయ్య సోమవారం తెలిపారు. ఎంపికైన జట్లు ఫిబ్రవరి 7, 8, 9 తేదీల్లో ప్రకాశం జిల్లా జే పంగులూరులో రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

31న నకరికల్లు మండల సర్వసభ్య సమావేశం

నకరికల్లు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ఈనెల 31వ తేదీ ఉదయం 10:30 గంటలకు నకరికల్లు మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్టు ఎంపీపీ ఎం అనురాధ తెలిపారు. సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, కో-ఆప్షన్ సభ్యులు, అన్ని శాఖల మండలస్థాయి అధికారులు హాజరుకావాలని కోరారు.

మహిళలకు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

నకరికల్లు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): గ్రామీణ మహిళలకు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్టు గుంటూరు యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ డైరెక్టర్ జీబీ కుమార్ తెలిపారు. శిక్షణా సమయంలో ఉచిత హాస్టల్, భోజన సదుపాయం కల్పించనున్నట్టు తెలిపారు. 19నుంచి 45 సంవత్సరాల వయసు గల మహిళలు ఈ కోర్సులో చేరవచ్చన్నారు. నెలరోజుల పాటు శిక్షణ కు ఉంటుందన్నారు. వివరాలకు 97006 87696, 81253 97953, 99499 30155 నెంబర్లను సంప్రదించాలన్నారు.

టీడీపీ కార్యకర్తపై వైసీపీ నేతల దాడి

నకరికల్లు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): నరసింగపాడులో స్వల్ప వివాదం కారణంగా ఏర్పడిన ఘర్షణలో టీడీపీ కార్యకర్త సంగు శ్రీనివాసరెడ్డిపై అదే గ్రామానికి చెందిన సర్పంచ్ కుమారుడు సంగు శివారెడ్డి, అతని అనుచరులతో కలసి దాడి చేశారు. ఈ దాడిలో సంగు శ్రీనివాసరెడ్డికి గాయాలయ్యాయి. ఆదివారం జరిగిన ఈ సంఘటనలో గాయపడిన శ్రీనివాసరెడ్డి నరసరావుపేటలోని వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా శ్రీనివాసరెడ్డి భార్య వెంకటరమణ సోమవారం నకరికల్లులో కన్నా లక్ష్మీనారాయణను కలసి తన భర్తపై దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరగా కన్నా తగు న్యాయం చేస్తానని ఆమెకు తెలిపారు.

వెంకటాయపాలెం గ్రామంలో చేతబడి కలం కలం

బెల్లంకొండ, జనవరి 27(ఆంధ్రజ్యోతి): బెల్లంకొండ మండలంలోని వెంకటాయపాలెం గ్రామంలో సోమవారం తెల్లవారుజామున చేతబడి కలంకలం రేగటంతో గ్రామస్థులంతా భయాందోళనలకు గురవుతున్నారు. ఎస్టీ కాలనీలో 12 గృహాల వద్ద నిమ్మకాయలు, పసుపు కుంకుమ, ఎర్రటి వస్త్రాలు, మిరపకాయలు వేయటంతో ఉదయాన్నే లేచిన కుటుంబాల వారు అవి గమనించి ఆందోళనకు గురయ్యారు. విషయం తెలుసుకున్న వెంకటాయపాలెం సర్పంచ్, గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ శ్రీనివాసనాయక్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వివరాలు సేకరించారు.

సచివాలయాల్లో.. సమూల మార్పు



- ఉద్యోగుల హేతుబద్ధీకరణతో సామర్థ్యం పెంపు
- మల్టీ పర్పస్, టెక్నికల్ విభాగాలుగా విభజన
- అవసరమైనవారికి సాంకేతిక శిక్షణ
- ఏఐ, డ్రోన్ టెక్నాలజీని గ్రామాలకు చేర్చే దిశగా అడుగులు

గ్రామ, వార్డు సచివాలయాల స్వరూపమే మారిపోతోందా.. అంటే అవుననే అనిపిస్తోంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సమాంతర వ్యవస్థగా మారి అస్తవ్యస్తంగా తయారైన సచివాలయ వ్యవస్థను కూటమి ప్రభుత్వం గాడిలో పెడుతోంది. నిర్దిష్టమైన జాబ్ చార్ట్ లేకపోవడంతో కొంతమందిపై అధిక పనిభారం పడుతుంటే, మరి కొందరు చక్కగా తప్పించుకు తిరిగిన పరిస్థితి గడిచిన ఐదేళ్లలో కనిపించింది. దీనిపై కూటమి సర్కార్ దృష్టి సారించింది. సచివాలయాల సామర్థ్యాన్ని పెంచి, ప్రజలకు మరింత చేరువ చేసే లక్ష్యంతో సచివాలయాల్లో సమూల మార్పులు తెస్తోంది. ఉద్యోగుల హేతబద్ధీకరణ ద్వారా మెరుగైన సేవలు ప్రజలకు అందించేందుకు ప్రయత్నిస్తోంది.



గుంటూరు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): సచివాలయాల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇప్పటి వరకూ ప్రతి 2వేల మందికి ఒక సచివాలయం చొప్పున ఉండగా, దాన్ని కనీసం 2,500 జనాభా, 5 కిలోమీటర్ల దూరాన్ని ప్రామాణికంగా తీసుకుని మార్పులు చేస్తున్నారు. జనసాంద్రత, దూరాన్ని బట్టి 2,500 లోపు జనాభా, 2,500 నుంచి 3,500 జనాభా, 3,501 ఆపై జనాభా కింద సచివాలయాలను విభజించారు. దాంతో పాటు ఉద్యోగులను మల్టీ పర్పస్, టెక్నికల్, ప్రజా ప్రయోజన విభాగాల కార్యదర్శులుగా విభజించనున్నారు. 2,500 లోపు జనాభా ఉంటే ఇద్దరు మల్టీ పర్పస్ ఉద్యోగులు, నలుగురు టెక్ని కల్ ఉద్యోగులు కలిపి మొత్తం ఆరుగురు ఉంటారు. 2,500- 3,500 జనాభా ఉన్న సచివాలయాలకు ముగ్గురు మల్టీ పర్పస్, నలుగురు టెక్నికల్ ఉద్యోగులు కలిపి ఏడుగురు, 3501 ఆపై జనాభా ఉన్న సచివాలయల్లో నలుగురు చొప్పున మల్టీపర్పస్, టెక్నికల్ ఉద్యోగులు వెరసి 8 మంది ఉంటారు. ప్రస్తుత విధానంలో ఒక్కో సచివాలయానికి 10 మంది ఉద్యోగులు ఉన్నారు. ప్రభుత్వం చేపట్టిన ఈ హేతుబద్ధీకరణ కారణంగా సగటున ఒక్కో సచివాలయానికి 7గురు ఉద్యోగులు సరిపోతారు.

ఉద్యోగుల హేతుబద్ధీకరణ..

గుంటూరు జిల్లాలో ప్రస్తుతం 568 సచివాలయాలు ఉండగా 4,780 మంది ఉద్యోగులు, పల్నాడు జిల్లాలో 537 సచివాలయాల్లో 4,494 మంది, బాపట్ల జిల్లాలో 477 సచివాలయాల్లో 4,240 మంది ఉ ఉద్యోగులు పనిచేస్తున్నారు. మొత్తంగా మూడు జిల్లాల్లో 1,582 సచివాలయాల్లో 13,514 మంది పనిచేస్తున్నారు. ప్రభుత్వం చేపట్టిన హేతుబద్ధీకరణ వల్ల ఒక్కో సచివాలయానికి సగటున ఏడుగురు ఉద్యోగులు సరిపోతారు. దీంతో జిల్లాలోని మొత్తం సచివాలయాల్లో 11,074 మంది ఉద్యోగులు సరిపోతారు. ఇంకా 2,440 మంది ఉద్యోగులు మిగులుతారు. హేతుబద్ధీకరణతో అందరి ఉద్యోగుల సేవలు సామర్థ్యం మేరకు వినియోగించుకునే అవకాశం ఏర్పడుతుందని అధికారులు చెబుతున్నారు.

యాస్పిరేషనల్ కార్యదర్శులు..?

అదనంగా ఉన్న ఉద్యోగులకు శిక్షణ ఇచ్చి యాస్పిరేషనల్ కార్యదర్శులుగా నియమించాలని ప్రభుత్వం యోచిస్తున్నట్లుగా తెలుస్తోంది. వారి ద్వారా ఆరిఫీషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ), డ్రోన్ సాంకేతికతను గ్రామాల్లోకి తీసుకెళ్లాలని ప్రభుత్వం భావిస్తోంది. క్రమబద్ధీకరణ అనంతరం గ్రామ, వార్డు సచివాలయాలకు పంచాయతీ కార్యదర్శి, ఒక వార్డు పరిపాలన కార్యదర్శులు ప్రధాన అధికారులుగా ఉండనున్నారు. సచివాలయాలను నైపుణ్యాభివృద్ధి, పరిశ్రమ అభివృద్ధి, ప్రాసెసింగ్, మార్కెటింగ్, ఉపాధి కల్పన కార్యాలయాలుగా తీర్చిదిద్దాలనేది ప్రభుత్వ ఉద్దేశం. మెరుగైన పనితీరు కనబరిచిన సిబ్బందికి బహుమతులు ఇవ్వాలని నిర్ణయించారు. సచివాలయాల ద్వారా అందజేసే ధ్రువపత్రాలపై ప్రభుత్వ 'చిహ్నం మాత్రమే ఉండాలని స్పష్టం చేశారు. సర్టిఫికెట్లపై ప్రభుత్వ లోగో మాత్రమే ఉండాలని సీఎం ఆదేశించారు.

ఆర్టీజీఎస్ కేంద్రాలుగా సచివాలయాలు

గ్రామ, వార్డు సచివాలయాలు రియల్‌టైమ్ గవర్నెన్స్ కార్యాలయాలుగా పనిచేసేలా చర్యలు చేపట్టనున్నట్లు తెలుస్తోంది. ముఖ్యమంత్రి ఆదేశాలతో ఇప్పటికే ఆ దిశగా అధికారులు చర్యలు చేపడుతున్నారు. పంచాయతీ కార్యదర్శి, వార్డు పరిపాలనా కార్యదర్శి సచివాలయ విభాగానికి అధిపతిగా ఉంటారు. సచివాలయాలు నైపుణ్య అభివృద్ధి, పరిశ్రమ అభివృద్ధి, ప్రాసెసింగ్, మార్కెటింగ్, ఉపాధి, విలువ జోడింపు వంటి వాటికి కేంద్రంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. గూగుల్, మైక్రోసాఫ్ట్ వంటి సంస్థల ద్వారా కార్య నిర్వాహకులకు సాంకేతిక శిక్షణ అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది.

హాజరు విధానంలో మార్పులు..

గతంలో సచివాలయ ఉద్యోగులు రోజుకు మూడుసార్లు హాజరు నమోదు చేయాల్సి వచ్చేది. ఉదయం 10 గంటలకు, మధ్యాహ్నం 3 గంటలు, సాయంత్రం 5 గంటలకు హాజరు వేసిన వారికి మాత్రమే వేతనం విడుదల చేసేవారు. కొందరు క్షేత్ర విధుల పేరిట హాజరు వేయకుండా వేతనం తీసుకునేవారు. పర్యవేక్షణ లేకపోవడంతో కొందరు విధులకు గైర్హాజరయ్యేవారు. దీంతో మిగిలిన ఉద్యోగులపై పని భారం పడేది. ఈ పరిస్థితిలో మార్పు తెచ్చే దిశగా కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టింది. ప్రత్యేక యాప్‌లో ప్రతి రోజు ఉదయం 10.30 గంటలలోపు, సాయంత్రం 5 గంటల తరువాత మాత్రమే ఉద్యోగుల హాజరు తీసుకుంటారు. రోజుకు రెండుసార్లు బయోమెట్రిక్ లేదా ముఖ ఆధారిత హాజరు వేయాల్సి ఉంటుంది. ఎవరైనా ఉద్యోగి ఉదయం హాజరు వేసి సాయంత్రం వేయకపోతే సాధారణ సెలవుగా పరిగణిస్తారు. ఈ యాప్‌ను ప్రభుత్వం ఖజానా శాఖకు అనుసంధానం చేస్తారని తెలుస్తోంది.

మిర్చియార్డు సెక్రటరీగా చంద్రిక

- ఆంజనేయులుని రిలీవ్ చేసిన మార్కెటింగ్ శాఖ
- తన ఒరిజినల్ పోస్టింగ్ అయిన రాజమండ్రికి రీబ్యాక్



చంద్రిక

గుంటూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్ కమిటీ గుంటూరు (మిర్చియార్డు) సెలెక్షన్ గ్రేడ్ సెక్రటరీగా ఎ.చంద్రిక నియమితులయ్యారు. ప్రస్తుతం మున్సిపల్ పరిపాలన శాఖ స్పెషల్ గ్రేడ్ కమిషనర్ హోదాలో గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్‌లో డిప్యూటీ ప్రాజెక్టు అధికారిగా ఉన్న ఆమెను ఏడాది పాటు డిప్యూటేషన్‌పై మార్కెటింగ్ శాఖ నియమించింది. ప్రస్తుత కార్యదర్శి వి.ఆంజనేయులుని తన ఒరిజినల్ పోస్టింగ్ అయిన రాజమహేంద్రవరం ఏఎంసీకి తక్షణం వెనక్కు వెళ్లాల్సిందిగా ఆదేశిస్తూ మార్కెటింగ్ శాఖ ఎక్స్ అఫీషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీ బుడితి రాజశేఖర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. నేడో, రేపో చంద్రిక జీవీఎంసీలో రిలీవ్ అయి గుంటూరు మిర్చియార్డుకు వచ్చి బాధ్యతలు స్వీకరిస్తారని మార్కెటింగ్ వర్గాలు తెలిపాయి.

తర్జనభర్జనలు జరుగుతూ...

ఇంచుమించు రెండు నెలలకు పైగానే మిర్చియార్డు సెక్రటరీ పోస్టింగ్‌పై ప్రభుత్వస్థాయిలో తర్జనభర్జనలు జరుగుతూ వచ్చాయి. తొలుత మిర్చియార్డు మాజీ చైర్మన్ మన్నవ సుబ్బారావు, మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖకు యార్డులో వైసీపీ హయాంలో జరిగిన కుంభకోణాలపై ఫిర్యాదు చేశారు. దానిపై విచారణ జరిపిన విజిలెన్స్ విభాగం రూ. 436 కోట్ల ఆదాయం మిర్చియార్డు కోల్పోయిందని పేర్కొంటూ కొంత మంది అధికారులను బాధ్యులుగా చేసి రిపోర్టు ఇచ్చింది. దీని ఆధారంగా తొలుత అప్పటి మిర్చియార్డు సెక్రటరీ ఐ.వెంకటేశ్వరరెడ్డిని ప్రభుత్వం తప్పించింది. ఆయన స్థానంలో రాజమహేంద్రవరం ఏఎంసీ సెక్రటరీ వినుకొండ ఆంజనేయులుకు అదనపు చార్జ్ కేటాయించి గుంటూరు మిర్చియార్డులో నియమించింది. ఆయన గత నవంబరు నెలలో బాధ్యతలు స్వీకరించారు. కాగా డిసెంబరు నెలలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ఎస్పీ సతీమణి చంద్రిక డిప్యూటేషన్‌పై మిర్చియార్డులో పోస్టింగ్ కోసం దరఖాస్తు చేసుకొన్నారు. దీనిపై మార్కెటింగ్ శాఖ ఆమోద లెటర్ ఇచ్చింది. దాంతో మున్సిపల్ పరిపాలన శాఖ ఆమెని మిర్చియార్డు సెక్రటరీగా పోస్టింగ్ చేసేందుకు గత వారం ఎన్‌వోసీని జారీ చేసింది. దీని ఆధారంగా మార్కెటింగ్ శాఖ సోమవారం చంద్రికకు డిప్యూటేషన్‌పై మిర్చియార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శిగా పోస్టింగ్ కల్పించి అదనపు చార్జ్ నుంచి వినుకొండ ఆంజనేయులుని రిలీవింగ్ చేస్తూ జీవో ఆర్‌టీ నంబరు. 29ని జారీ చేసింది.

చివరి నిమిషం వరకు హైకోర్టులో పోరాటం

రాజమహేంద్రవరం ఏఎంసీ సెక్రెటరీగా ఉంటూ గుంటూరు మిర్చియార్డు కార్యదర్శిగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న వినుకొండ ఆంజనేయులు చివరి నిమిషం వరకు ఇక్కడే కొనసాగేందుకు ప్రయత్నించారు. ఎప్పుడైతే చంద్రిక డిప్యూటేషన్‌పై మిర్చియార్డులో పోస్టింగ్ కోసం దరఖాస్తు చేసుకొన్నారో ఆ విషయాన్ని తెలుసుకొని మార్కెటింగ్ కమిషనర్ ప్రొసీడింగ్‌పై ఆయన హైకోర్టులో కేసు వేశారు. చట్టం ప్రకారం మార్కెటింగ్ స్పెషల్ సీఎస్, కమిషనర్ నడుచుకొనేలా ఆర్డర్స్ పాస్ చేయాలని ఆయన అభ్యర్థించారు. అయితే హైకోర్టు తోసిపుచ్చింది.

మూడున్నరేళ్లలో వంతెనలు పూర్తి చేస్తాం

- నిర్మాణానికి రూ.41 కోట్లు కేటాయింపు
- కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్



గుంటూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): 'మొదటి ఏడాదిలోపు వంతెనల మంజూరు, రెండున్నర ఏళ్లలో నిర్మాణ పనులు, మూడున్నర ఏళ్ల లోపు పూర్తి చేసేలా పక్కా ప్రణాళికతో పని చేస్తున్నాం' అని గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ చెప్పారు. పెదపలకలూరు ఎల్సీ నంబర్-6కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన సందర్భంగా ఢిల్లీలోని తన కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గుంటూరు నగరాభివృద్ధికి ఒక స్పష్టమైన ప్రణాళిక రచించామన్నారు. గుంటూరు జిల్లా వాసుల మూడు దశాబ్దాల కలగా ఉన్న శంకర్ విలాస్ ఆర్వోబీ నిర్మాణంతోపాటు ఔటర్ రింగ్ రోడ్ ఆర్‌వోబీ నిర్మాణానికి కూడా కేంద్ర ప్రభుత్వం ద్వారా నిధులు మంజూరు చేయించుకోగలిగామని తెలిపారు. గుంటూరు నల్లపాడు సెక్షన్‌లోని పెదపలకలూరు (పుల్లడిగుంట - పేరేచర్ల రోడ్డు) ఎల్సీ నంబరు 6ను రైల్వే శాఖ ద్వారా మంజూరు చేయించుకున్నామని, ఈ నిర్మాణానికి రూ.41 కోట్లను కేంద్ర ప్రభుత్వం కేటాయించిందని వివరించారు. ఇప్పటిదాకా మంజూరైన ఈ మూడు ప్రాజెక్టుల నిర్మాణాలకు పూర్తిగా కేంద్ర ప్రభుత్వ నిధులతోనే నిర్మాణాలు జరుగుతాయని చెప్పారు.

రిసార్టు మోసాలపై.. పోలీసుల గురి

(5వ పేజీ తరువాయి)

పాల్పడ్డారు. ఈ మోసాలపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యా టకాభివృద్ధి సూర్యలం క హరిత బీచ్ రిసార్టు పేరిట నకిలీ వెబ్‌సైట్ ద్వారా జరుగుతున్న సైబర్ మోసాలపై ఈ నెల 16న ఏపీటీడీసీ(ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్) డీజీపీకి లేఖ ద్వారా ఫిర్యాదు చేసింది. వెంటనే రంగంలోకి దిగిన డీజీపీ కార్యాలయం సూర్యలంక హరిత బీచ్ రిసార్టు సిబ్బంది ద్వారా బాధితుల వివరాలతో పాటు గతంలో ఇచ్చిన ఫిర్యాదుల పూర్వాపరాలతో సమగ్ర నివేదిక కోరినట్లు సమాచారం. ఇప్పటికే నకిలీ వెబ్‌సైట్‌పై సైబర్ సెల్ పూర్తి స్థాయిలో దృష్టి కేంద్రీకరించగా, బ్యాంకు ఖాతా వివరాలు జల్లెడ పట్టే పనిలో నిమగ్నమయి ఉన్నారు

పెద్ద సంఖ్యలో పర్యాటకులు...

జిల్లాలో ఉన్న తీర ప్రాంత బీచ్‌లకు వారాంతాలతో పాటు వరుస సెలవుల వేళ కూడా పర్యాటకులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. వీరిలో ఎక్కువ మంది హైదరాబాద్, బెంగళూరులో పనిచేసే సాఫ్ట్‌వేర్ ఉద్యోగులే ఉంటారు. వీరిలో ఎక్కువ శాతం మంది రెండు వారాల ముందుగానే ఆన్‌లైన్ ద్వారానే రిసార్టులు బుక్ చేసుకుంటారు. వీరినే లక్ష్యంగా చేసుకుని సైబర్ దొంగలు రెచ్చిపోతున్నారు. సైబర్ మోసగాళ్లు ఈ తరహా మోసాలకు పాల్పడిన ఉదంతాలు ఏడాది కాలం నుంచి వెలుగుచూస్తూనే ఉన్నాయి. ప్రతిసారీ నకిలీ వెబ్‌సైటే వారికి ఆయుధంగా మారుతోంది. బ్యాంకుఖాతాలు, ఫోన్ నంబర్లు ఇవన్నీ తర్వాత దశలోనే. ప్రభుత్వ పర్యవేక్షణలో నడిచే వెబ్‌సైట్‌పై పర్యాటకులకు అవగాహన కల్పించడంలో గానీ, పెద్ద ఎత్తున ప్రచారం చేయడంలో కానీ వ్యవస్థల వైఫల్యం కూడా స్పష్టంగా కనబడుతోంది. పదేపదే సైబర్ మోసాలు వెలుగుచూస్తున్నా వాటిని కనిపెట్టడంలో సదరు విభాగాల నిర్లక్ష్యం కూడా నేరగాళ్లకు కలిసి వస్తోంది. ఇప్పుడు ఏకంగా ఏపీటీడీసీయే రంగంలోకి దిగి డీజీపీకి ఫిర్యాదు చేయడంతో విచారణలో వేగం మొదలైంది. జరిగిన మోసాల్లో అధికశాతం సూర్యలంక హరిత బీచ్ రిసార్టు పేరిటనే జరిగినందున ఇక్కడ నుంచే పోలీస్ శాఖ విచారణ ప్రారంభించింది. ఇదే కాకుండా రాత్రి 12 గంటలు దాటిన తర్వాత గదుల వివరాలు తెలుసుకోవడానికి హరిత బీచ్ రిసార్టుకు ఫోన్ చేసే వారిపై కూడా సైబర్ విభాగం దృష్టి పెట్టింది. వెబ్‌సైట్‌లో పెడుతున్న గదుల ఖాళీ వివరాలు, ఫోటోలు ఇవన్నీ కూడా హరిత బీచ్ రిసార్టు ఒరిజినల్ వెబ్‌సైట్‌తోనే పోలి ఉండడంతో ఆ దిశగా కూడా పోలీస్ శాఖ విచారణ ముమ్మరం చేసింది.

ఈవో సత్యనారాయణరెడ్డి సస్పెన్షన్‌కు రంగం సిద్ధం

- చేయని ఖర్చులు చేసినట్టు చూపి రూ. రెండు కోట్లకు పైగా స్వాహా...
- కమిషనర్‌కు సమగ్ర నివేదిక అందించిన డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్



ఈవో సత్యనారాయణరెడ్డి

గుంటూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): కంచే చేను మేసిన చందంగా దేవాదాయశాఖ ఆదాయ, వ్యయాలకు కాపలాదారుగా ఉండాల్సిన ఆ శాఖ ఈవోనే వివిధ మార్గాల్లో సుమారు రూ. 2 కోట్లకు పైగా స్వాహా చేసినట్టు ఉమ్మడి గుంటూరు జిల్లా దేవాదాయశాఖ డిప్యూటీ కమిషనర్ కేబీ శ్రీనివాస్ జరిపిన సమగ్ర దర్యాప్తుల్లో ఆనాటి మందడపు టెంపుల్స్ ఈవో టీ సత్యనారాయణరెడ్డి అవినీతి బాగోతం వెల్లడైంది. ఆ ఈవో ఏ విధంగా దేవుడి సొమ్మును కైంకర్యం చేసింది అంశాల వారీగా నివేదిక అందించారు. ప్రస్తుతం ఈవో సత్యనారాయణరెడ్డి అక్కడ నుంచి బదిలీ అయి బొప్పూడి ఆంజనేయస్వామి దేవాలయ ఈవోగా కొనసాగుతున్నారు. అయితే రెండు, మూడు రోజుల్లో ఆయన సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ అయ్యే అవకాశాలు మెండుగా వున్నాయి. ఆయన మందడపు గ్రూపు టెంపుల్స్ ఈవోగా ఉన్న సమయంలో కళ్యాణోత్సవాలు, గ్రామోత్సవాలకు ఆయా దేవాలయాలు నోచుకోలేదు. అయినా రికార్డుల్లో మాత్రం రూ. 50 లక్షల 53 వేలకు పైగా ఖర్చు చేసి నాలుగు దేవాలయాల్లో ఉత్సవాలు అంగరంగవైభవంగా నిర్వహించినట్టు లెక్కలు చూపటంతో ఉన్నతాధికారులు నిర్ఘాంతపోయారు. అంతే కాదు అయ్యగారు దేవుడు సొమ్మేగా అడిగేదెవరు అన్నట్టుగా సుమారు రూ.18.50 లక్షలకు ఓచర్లు కూడా లేకుండా ఖర్చు పెట్టినట్టు లెక్కల్లో చూపించారు. అంతే కాదు ఎటువంటి ముందస్తు బడ్జెట్ లేకుండా రూ.26.50 లక్షలకు పైగా ఖర్చు పెట్టినట్టు వెల్లడైంది. ఇక పండుగలకు విద్యుత్ దీపాలు వేయించకుండానే ప్రత్యేకంగా వేయించినట్టు చూపటం, లేని ఉద్యాన వనాలను ఉన్నట్టుగా రికార్డుల్లో చూపించి వాటి సంరక్షణకు రూ. లక్షల్లో ఖర్చు చేసినట్టుగా చూపినట్లు దర్యాప్తులో తేలింది. ఇక ఇదంతా ఒక ఎత్తు అయితే, తన ఇష్టానుసారంగా మూడు బ్యాంకుల్లో దేవాదాయశాఖకు చెందిన సొమ్మును మూడు ఎఫ్‌డీలలో ఉండగా కాలపరిమితి తీరకుండానే విత్ డ్రా చేయడాన్ని ఉన్నతాధికారులు పెద్ద నేరంగా భావిస్తున్నారు. విత్ డ్రా చేయాలంటే ఉన్నతాధికారుల అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. అలా తీసుకోకుండా ఈవో చేసిన చర్య మూలంగా ఆ దేవాలయాలకు రావాల్సిన రూ. 7 లక్షల రూ. 34 వేలకు పైగా వడ్డీ రూపంలో నష్టపోయాయి. 2019లో విత్‌డ్రా చేయగా ఇప్పటి వరకు కూడా ఉన్నతాధికారుల నుంచి అనుమతి తీసుకోలేదు. అంతే కాదు ఇతని నిర్వాకం మూలంగా దేవుళ్ళు కూడా పన్ను ఎగవేతదారుల జాబితాలో చేరిపోయారు. గత ఐదేళ్ళు కూడా ప్రభుత్వానికి ఆలయాల ద్వారా చెల్లించాల్సిన పన్నులను చెల్లించకుండా ఇతని వ్యవహరించిన తీరు పట్ల కూడా ఉన్నతాధికారులు ఆగ్రహంతో ఉన్నారు.

ప్రయోగాత్మకంగా పాప్‌కార్న్

- 92 రోజులకే చేతికి వస్తున్న పంట
- టీడీపీ నేత మురళీకృష్ణ ఆధ్వర్యంలో 100 మంది రైతులు సాగు
- నూజివీడులో పాప్‌కార్న్ ప్రాసెసింగ్ యూనిట్
- దళారులతో పని లేకుండా టన్ను రూ.22,500లకు కొంటామని భరోసా



పాప్‌కార్న్ మొక్కజొన్న పైరుకు నీటితడులు అందిస్తున్న టీడీపీ నేత మురళీ కృష్ణ

కొల్లూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): పాప్‌కార్న్ మొక్కజొన్న రకం నూతనంగా టీడీపీ నేత మురళీకృష్ణ ఆధ్వర్యంలో 100 మంది రైతులు సాగు చేపట్టారు. కొల్లూరు మండలంలోని కొల్లూరు, ఈపూరుతోపాటు జువ్వలపాలెం, తిప్పలకట్ట, కిష్కింద పాలెం తదితర లంక గ్రామాల్లోని రైతులు కూడా పాప్‌కార్న్ మొక్కజొన్న రకం సాగును మురళీకృష్ణ సూచనల మేరకు చేపట్టారు. ఉమ్మడి కృష్ణా జిల్లా నూజివీడులో పాప్‌కార్న్ ప్రాసెసింగ్ యూనిట్‌ను ఓ సంస్థ నెలకొల్పింది. ఆ సంస్థ ప్రతినిధులు మురళీకృష్ణను ఆశ్రయించి పాప్‌కార్న్ మొక్కజొన్నపై వివరించడంతో పాటు పంట దిగుబడులను టన్ను రూ.22,500లకు తామే కొనుగోలు చేస్తామని భరోసా కల్పించారు. దీంతో ఆయన సాగు చేస్తున్న 80 ఎకరాలలో 40 ఎకరాలు పాప్ కార్న్ రకాన్ని విత్తి సాగు చేపట్టారు. ఇతర గ్రామాల్లో రైతులను కూడా ప్రోత్సహించడంతో వారు కూడా సాగు వైపు మొగ్గు చూపారు. పాప్‌కార్న్ విత్తనాలు అమెరికా నుంచి దిగుమతి అయ్యాయని, ఎకరాకు ఐదు కిలోల చొప్పున సంస్థ ప్రతినిధులు అందజేశారని టీడీపీ నేత తెలిపారు. పంటకు చీడ పీడలు ఆశించకుండా తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలతో పాటు అవసరమైన రసాయన మందులను కూడా సంస్థ ప్రతినిధులు సూచించడంతో పాటు అవసరమైన రైతులకు అందజేసినట్లు చెప్పారు. ఇప్పటికే లంక గ్రామాల్లో సాగు చేసిన రైతులకు 3.5 టన్నులు దిగుబడులు వచ్చాయనీ, వాటిని సంస్థ ప్రతినిధులే కొనుగోలు చేసి నగదు చెల్లింపులు జరిపి తీసుకు వెళ్లినట్లు ఆయన తెలిపారు. దళారులు, మార్కెట్ ఒడుదొడుకులతో పని లేకుండా కంపెనీయే పంట ఉత్పత్తులను కొనుగోలు చేయడం వల్ల రైతులకు మేలు చేకూరుతుందని పేర్కొన్నారు.

ఐదు టన్నుల దిగుబడులే లక్ష్యంగా..

పాప్‌కార్న్ మొక్కజొన్న పంట ఐదు టన్నుల దిగుబడులే లక్ష్యంగా చర్యలు చేపట్టినట్లు మురళీకృష్ణ పేర్కొన్నారు. సాధారణ మొక్కజొన్న పంట కాల పరిమితి 120 రోజులు కాగా, పాప్ కార్న్ మొక్కజొన్న పంట 92 రోజులకే చేతికి వస్తుందన్నారు. పైరు కూడా సాధారణ రకాల కంటే కొంచెం తక్కువ ఎత్తులో పెరుగుతుందన్నారు. దీనివలన ప్రకృతి విపత్తుల వల్ల పంట దెబ్బతినే అవకాశాలు తక్కువగా ఉంటాయని చెప్పారు. సాగు చేస్తున్న పంటను గమనిస్తూ నీటి యాజమాన్య పద్ధతులతోపాటు చీడపీడల నివారణకు రసాయన మందులు పిచికారీ చేయడంతో పాటు ఎరువులు కూడా సకాలంలో సరైన మోతాదులో పంటకు అందిస్తున్నట్లు చెప్పారు. పంట ఆశాజనకంగా ఉందనీ, తాను ఆశించిన మేర ఫలితాలు వస్తాయని భావిస్తున్నట్లు తెలిపారు. ఇందుకోసం తనతోపాటు కూలీలు కూడా శ్రమిస్తున్నారని చెప్పారు. వచ్చే దిగుబడులను బట్టి రైతులు పాప్ కార్న్ సాగుకు మరింత మంది మొగ్గు చూపే అవకాశాలు ఉన్నాయని ఆయన చెప్పారు.



ప్రయోగాత్మకంగా సాగు చేస్తున్న పాప్‌కార్న్ రకం మొక్కజొన్న పైరు

1 నుంచి రిజిస్ట్రేషన్ చార్జీలు పెంపు

(5వ పేజీ తరువాయి)

- నగర, పట్టణ, మండల శివారు ప్రాంతాల్లో స్వల్పంగా పెరుగుదల
- బహిరంగ మార్కెట్‌లో కంటే ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో తగ్గింపునకు నిర్ణయం

కసరత్తు చేసి ఉన్నతాధికారులకు జాబితాలను పంపారు. దీనిపై జిల్లా స్థాయిలో జాయింట్ కలెక్టర్ల నేతృత్వంలోని కమిటీ ఆయా ప్రతిపాదనలపై చర్చించి తుది నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో వచ్చే నెల ఫిబ్రవరి 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా రిజిస్ట్రేషన్ చార్జీల పెంపుకు రిజిస్ట్రేషన్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో నేడు, రేపు మిగిలిన ప్రక్రియను పూర్తి చేసి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వారీగా ఏఏడి నెంబర్ల పరిధిలో ఏ స్థాయిలో పెంచుతున్నారని దానిని ఆన్లైన్ చేసే ప్రక్రియను ప్రారంభించనున్నారు. వాస్తవానికి రూరల్ ప్రాంతాల్లో ప్రతి రెండేళ్ళకు ఒకసారి, అర్బన్ ప్రాంతాల్లో ఏడాదికి ఒకసారి భూముల మార్కెట్ విలువలను సవరించాల్సి ఉంటుంది. అయితే 2019 తర్వాత రూరల్ ప్రాంతంలో ఇంతవరకు భూముల మార్కెట్ విలువలను సవరించలేదు. అయితే కొత్త జిల్లాల ఏర్పాటు నేపథ్యంలో 2022 ఏప్రిల్ లో కొంతవరకు కొత్త జిల్లాలు ఏర్పాటయ్యే ప్రాంతాల్లో కొంతమేర భూముల మార్కెట్ విలువలను పెంచారు. దీంతో కొత్త జిల్లాలు ఏర్పాటైన ప్రాంతాల్లో కొంతమేర రిజిస్ట్రేషన్ చార్జీలు 2022లో పెరిగాయి. ఆ తరువాత 2023 లోనూ అక్కడక్కడ భూములలో సవరించారు ముఖ్యంగా ఒక్కో సబ్ రిజిస్ట్రర్ కార్యాలయ పరిధిలో అత్యధికంగా భూముల క్రయ, విక్రయాలు జరిగే గ్రామాలు, అదేవిధంగా బహిరంగ మార్కెట్లో భూముల మార్కెట్ విలువలు ఎక్కువగా పెరిగిన చోట కొంతమేర మార్కెట్ విలువలను పెంచారు. అయితే 2024లో రిజిస్ట్రేషన్ చార్జీలను పెంచలేదు. తాజాగా రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ, అర్బన్, సెమీ అర్బన్ తదితర అన్ని ప్రాంతాల్లో భూముల మార్కెట్ విలువలను సవరిస్తున్నారు. ఈ నేపథ్యంలో గుంటూరు, నరసరావుపేట, తెనాలి, బాపట్ల, రేపల్లె, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, వినుకొండ, పొన్నూరు తదితర అర్బన్, సెమీ అర్బన్ ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్ చార్జీలు పెరగబోతున్నాయి. నగర, పట్టణ ప్రాంతాల్లోని వ్యాపార వాణిజ్య కూడళ్ళలోనూ, ధనిక వర్గాలు ఉండే ప్రాంతాల్లోనూ భారీగా కాకపోయినప్పటికీ 15 నుంచి 25 శాతం మేర భూముల మార్కెట్ విలువలను పెంచబోతున్నారు. జిల్లా వ్యాప్తంగా భూముల మార్కెట్లలో ఎక్కడెక్కడ ఏ స్థాయిలో పెరగబోతున్నాయో అంతే స్థాయిలో భూముల మార్కెట్ విలువలను యధాస్థితిలో కొనసాగించబోతున్నట్లు రిజిస్ట్రేషన్ అధికార వర్గాలు అంటున్నాయి. అంతేకాకుండా ఈ దఫా అనేక చోట్ల ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను దృష్టిలో ఉంచుకొని భూముల మార్కెట్ విలువలను తగ్గించబోతున్నారు. కొన్నిచోట్ల ప్రైవేటు మార్కెట్లో కంటే కూడా ప్రభుత్వ మార్కెట్ విలువలు ఎక్కువగా ఉండడం గమనార్హం. ఈ నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో మార్కెట్ విలువలను తగ్గించాలంటూ ఎంతోకాలంగా ప్రజల నుంచి రిజిస్ట్రేషన్ శాఖ అధికారులపై ఒత్తిళ్లు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో బహిరంగ మార్కెట్లో ఉన్న ధరలు, అలాగే ప్రభుత్వ మార్కెట్ ధరలను బేరీజు వేసుకుని సబ్ రిజిస్ట్రార్ లు ఆయా ప్రాంతాల్లో భూముల మార్కెట్ విలువలను తగ్గించాలని నిర్ణయించారు.



రియల్ రంగంపై పెంపు ప్రభావం

రిజిస్ట్రేషన్స్ చార్జీలు పెంపుదల రియల్‌ఎస్టేట్ రంగంపై ప్రభావం చూపనుందని రియల్ ఎస్టేట్ వర్గాలు అభిప్రాయ పడుతున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రియల్ ఎస్టేట్ రంగం ఎంతో కాలంగా ఒడిదుడుకులు ఎదుర్కొంటోంది. ఇప్పటికే జిల్లాలో అనేక చోట్ల బహిరంగ మార్కెట్‌లో భూముల ధరలతో సమానంగా ప్రభుత్వ మార్కెట్‌లో భూముల ధరలు ఉండటం గమనార్హం. ఈ నేపథ్యంలో ఇంటి నిర్మాణం కోసం ఇంటి స్థలాలు కొనుగోలు చేసేవారు తప్ప, వ్యాపార పరంగా స్థలాలు, పొలాలు కొనుగోలు చేసేవారు రిజిస్ట్రేషన్స్ ఆలోచన లేకుండా ఒప్పంద పత్రాలకు పరిమితమవుతున్నారు. కొన్ని సందర్భాల్లో ఆయా ఒప్పందాలు వివాదాలకు దారితీస్తున్నాయి. ఫలితంగా ఆయా స్థలాల క్రయవిక్రయదారులు ఇబ్బందులు, కోర్టు వివాదాలు ఎదుర్కొంటున్నారు. అయితే రిజిస్ట్రేషన్ శాఖ మాత్రం ఇవేమిపట్టవన్నట్లుగా భూముల మార్కెట్ ధరలు పెంచుకుంటూపోతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం భూముల మార్కెట్ విలువలపై క్షేత్రస్థాయి పరిస్థితులను పరిగణలోకి తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

భూమి స్వాధీనం చేసుకున్న అధికారులు

నాదెండ్ల, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత ఆధీనంలో ఉన్న భూమిని ఎట్టకేలకు రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఎవరైనా ఈ భూమిని ఆక్రమిస్తే శిక్షార్హులు అంటూ ఫ్లెక్సీ కూడా సదరు భూమిలో ఏర్పాటు చేశారు. చిరుమామిళ్ళ రెవెన్యూ గ్రామపరిధిలో 13.60 ఎకరాల భూమిని 20 ఏళ్ల క్రిందట గ్రామానికి చెందిన యానాదులకు ప్రభుత్వం ఇచ్చింది. అయితే గ్రామానికి చెందిన వైసీపీ నేత సింగారెడ్డి కోటిరెడ్డి ఆ భూమిని ఆక్రమించుకున్నాడని ఎస్టీలు జిల్లా కలెక్టర్, ఎస్పీకి ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు నాదెండ్ల తహసీల్దార్ విచారించారు. యానాదులకు కూడా నోటీసులు ఇచ్చి ఆ భూమిని స్వాధీనం చేసుకున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు, పాల్గొన్న అధికారులు

సర్వేలన్నీ పూర్తి చేయాలి: కలెక్టర్

నరసరావుపేట టౌన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది క్షేత్రస్థాయిలో నిర్వహించే సర్వేలను రెండు రోజులలో పూర్తి చేయించాలని ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లను జిల్లా కలెక్టర్ పీ అరుణ్‌బాబు ఆదేశించారు. సోమవారం నరసరావుపేట పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో గ్రామ, వార్డు సచివాలయాల సేవలపై సమావేశం నిర్వహించారు. కలెక్టర్ అరుణ్‌బాబు మాట్లాడుతూ మంగళవారంలోగా జిల్లాలో 20వేల మంది శిశువుల ఆధార్ వివరాలను యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. మిగిలిన 30వేల మందికి క్యాంపుల్లో అందించాలన్నారు.

● నరసరావుపేట టౌన్: కలెక్టర్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ప్రజల నుంచి 32 వినతులను జిల్లా కలెక్టర్ స్వీకరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సూరజ్, రెవెన్యూ డివిజనల్ అధికారి మధులత, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

● నరసరావుపేట లీగల్: సోమవారం పల్నాడు జిల్లా పోలీస్ కార్యాలయం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో పరిపాలన అదనపు ఎస్పీ జేవీ సంతోష్ పాల్గొని ప్రజల వద్ద నుంచి వివిధ అంశాలకు సంబంధించిన 43 ఫిర్యాదులను స్వీకరించారు.

పెట్టుబడుల ఆకర్షణలో ఏపీ: ఎమ్మెల్యే అరవిందబాబు

నరసరావుపేట టౌన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సులో ప్రత్యేక ఆకర్షణగా ఆంధ్రప్రదేశ్ నిలిచిందని ఎమ్మెల్యే డాక్టర్ చదల వాడ అరవిందబాబు అన్నారు. సోమవారం నరసరావుపేట టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో మీడియా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ దావోస్ పర్యటన విజయవంతం అయిందన్నారు. నారా లోకేశ్ యువగళం పాదయాత్ర రాష్ట్రంలో యువతకు స్ఫూర్తిదాయకంగా నిలిచిందన్నారు.

క్లుప్తంగా..

● ఈపూరు: మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ రాధిక అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం తూతూమంత్రంగా నిర్వహించారు. కొందరు ప్రజాప్రతినిధులు, అధికారులు సంతకాలు పెట్టి వెళ్ళిపోయారు.

● యడ్లపాడు: తెలుగు నాటక పరిషత్తుల సమ్మేళనం (వేదిక) ఆధ్వర్యంలో మరిన్ని సామాజిక కార్యక్రమాలు చేపట్టి నిర్వహించనున్నట్లు తెలుగు నాటక పరిషత్తుల సమ్మేళనం (వేదిక) అధ్యక్షుడు డాక్టర్ ముత్తవరపు సురేష్‌బాబు తెలిపారు. భవిష్యత్‌లో వేదిక ద్వారా ప్రజలను చైతన్య పరచే సామాజిక కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టనున్నట్లు వెల్లడించారు.

● వినుకొండ టౌన్: పట్టణంలోని శ్రీనివాసనగర్‌లోని వెంకటేశ్వరస్వామి దేవాలయంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 7వ తేదీ నుంచి వెంకటేశ్వరస్వామి వ్రతాలు నిర్వహిస్తున్నట్లు పల్నాడు జిల్లా విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు భాగవతుల రవికుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

● ఈపూరు: మండలంలోని వనికుంటలో అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన కుటుంబాలకు కీర్తి రూరల్ డెవలప్‌మెంట్ తరుపున దుస్తులు, దుప్పట్లు సోమవారం అందజేశారు.

● నరసరావుపేట టౌన్: వీవోఏల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ పల్నాడు జిల్లా ఉపాధ్యక్షుడు గుంటూరు విజయకుమార్ డిమాండ్ చేశారు. సోమవారం గాంధీ పార్క్ వద్ద ఏపీ వెలుగు వీవోఏ ఉద్యోగుల సంఘం మూడు రోజులు సామూహిక నిరాహార దీక్షలు ప్రారంభించారు.


● నరసరావుపేట రూరల్: జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు సందర్భంగా రహదారి భద్రత గోడ పత్రికను జిల్లా రహదారి భద్రత కమిటీ కన్వీనర్ రాజా నాయక్ సోమవారం ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో రోడ్ సేఫ్టీ ఎన్‌జీవో ప్రతినిధి ఆర్.బంగారయ్య, హజరత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

● నరసరావుపేట లీగల్: స్థానిక మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మార్చి 8న న్యాయస్థాన భవనాల ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు నరసరావుపేట మండల న్యాయ సేవ అధికార సంస్థ చైర్మన్ పదమూడవ అదనపు జిల్లా న్యాయ అధికారి ఎన్ సత్య శ్రీ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

● నాదెండ్ల: మండలంలోని చిరుమామిళ్ళ, సంకురాత్రిపాడులో పశు వైద్యాధికారులు పశు ఆరోగ్య శిబిరాలను నిర్వహించారు. చిరుమామిళ్ళలో డాక్టర్ ఏడుకొండలు పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. సంకురాత్రిపాడులో సాతులూరు పశువైద్యాధికారి శ్రీలక్ష్మి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

సమస్యల నిలయంగా కొట్నాల్ల వీధి

అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా..



వినుకొండ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): సమస్యలకు నిలయంగా కొట్నాల్ల బజార్ మారింది. ఇక్కడ ముస్లిం మైనార్టీ వర్గాల వారు నివసిస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా ఈ వీధిలో సమస్యలు తాండవమాడుతున్నాయి. వైసీపీ ఐదేళ్ల పాలనలో అభివృద్ధికి నోచుకోలేదు. తాగునీటి పైపు లైన్‌ల కోసం రహదారులను పగలగొట్టారు. వీటిని పునరుద్ధరించడాన్ని విస్మరించారు. కల్వర్టులు పగిలిపోయాయి. కాలువల్లో మురుగునీరు పారుదల లేక దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. దోమల బెడదతో అల్లాడిపోతున్నారు. సిమెంట్ రోడ్డు గోతుల మయంగా ఉంది. పేదలు నివసించే ఈ బజారు నిర్లక్ష్యానికి గురైంది. వార్డులో ప్రగతి పనులు చేపట్టని నేపథ్యంలో నిరసన తెలియజేస్తూ వైసీపీకి రాజీనామా చేశారు. అధికారులు ఈ వీధికి రావడం వెళ్లడం తప్ప సమస్యలను పరిష్కరించలేకపోయారు. అధికారులు.. వైసీపీ పాలన తీరుపై ఈ వీధిలో నివసించేవారు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. టీడీపీ అధికారంలో వచ్చాకైనా ఏళ్ల తరబడి ఉన్న తమ సమస్యలు పరిష్కరించాలని వేడుకుంటున్నారు. మురుగు కాలువలు.. సిమెంట్ రహదారులు నిర్మించాలని ఆ ప్రాంత వాసులు కోరుతున్నారు.

అభివృద్ధిని గాలికొదిలేశారు

● షేక్ నన్నేసా, 23వ వార్డు కౌన్సిలర్



పేదలు నివసించే కొట్నాల బజారులో సమస్యలు పరిష్కారం కావడంలేదని తాను మునిసిపల్ అధికారులకు విన్నవించినా చర్యలు తీసుకోలేదని 23వ వార్డు కౌన్సిలర్ షేక్ నన్నేసా ఆవేదన వ్యక్తం చేశారు. సిమెంట్ రోడ్లు.. కాలువలు నిర్మించాలని కోరుతున్నా తమ మొర అలకించడలేదన్నారు. ప్రభుత్వం రహదారులు, కాలువలు నిర్మించాలని ఇందుకు ప్రభుత్వ చీఫ్‌విప్ ఆంజనేయులు స్పందించి అయా సమస్యలు పరిష్కారిస్తారని విజ్ఞప్తి చేశారు.



కొట్నాల్ల బజార్‌లో పగిలిపోయిన మురుగు కాలువలు

రహదారులపై గోతులతో ఇక్కట్లు

● పఠాన్ అయూబ్ ఖాన్, కొట్నాల్ల బజార్



కొట్నాల్ల బజార్‌లో ప్రజలు సమస్యలతో జీవనం సాగిస్తున్నారు. సమస్యలు పరిష్కరించడంలో గత ఐదేళ్ల పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. కాలువలు పగిలిపోయి వర్షం కురిస్తే రోడ్లు ముంపునకు గురవుతున్నాయి. కల్వర్టులు పగిలిపోయాయి. సమస్యలను ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు దృష్టికి తీసుకువెళతాము. సిమెంట్ రోడ్లు, మురుగు కాలవలు నిర్మిస్తారని భావిస్తున్నాం.

గాయత్రి నగర్ మౌలిక వసతులు కరవు

మునిసిపాల్టీలోని 31 వార్డులో గాయత్రి నగర్ ఉంది. ఇక్కడ మౌలిక వసతులు లేవు. తాగు నీరు, రహదారులు, మురుగు కాలువలు, వీధి దీపాలు లేవు. అభివృద్ధికి అమడదూరంలో ఉంది. ఈ ప్రాంతంలోని సమస్యలను అధికారుల దృష్టి తీసుకెళ్లే అవకాశంను ఆంధ్రజ్యోతి కల్పిస్తోంది. గాయత్రి నగర్‌లో అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా.. కార్యక్రమానికి నిర్వహిస్తోంది. ప్రభుత్వ చీఫ్‌విప్ పాల్గొంటున్నారు. గత ఐదేళ్ల అభివృద్ధికి నోచుకోక సమస్యలతో నగర్ వాసులు సతమతమవుతున్నారు. టీడీపీ అధికారంలోకి రావడంతో గాయత్రి నగర్ సమస్యలు పరిష్కారమవుతాయన్న గంపెడాశతో ఉన్నారు. ఈ ప్రాంతంలో వాహనాల పార్కింగ్‌కు సంబంధించి సమస్యలను ఎదుర్కొంటున్నట్లు ఆ ప్రాంత వాసులు తెలిపారు.



రహదారులు, కాలువల నిర్మాణానికి నోచుకోని గాయత్రి నగర్

అధికారులు, నాయకులు సమష్టిగా పనిచేయాలి

చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ప్రజాప్రతినిదులు, అధికారులు ప్రజలు సమిష్టిగా కలిసి పనిచేయాలని, అప్పుడే దీర్ఘకాలిక లక్ష్యాలను సాధించగలుగుతామని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యలయంలో సోమవారం ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి మండలంలోని పలు గ్రామాల నుంచి పలు సమస్యలపై చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులుకు వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు స్ఫూర్తితో తాను వినుకొండలో ప్రజాదర్బార్‌ను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉంటానని, ఎప్పుడు ఫోన్‌చేసి ఒక్కమాట చెప్పినా సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. బాధ్యతగా పనిచేసే వారిని తప్పనిసరిగా వారిని ప్రోత్సహిస్తానని, బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కూటమి నాయకులు సమస్యలను తీసుకొని వస్తే అధికారులు స్పందించి పనులు చేయాలన్నారు. ప్రజా దర్బార్‌లో వచ్చిన 122 అర్జీలను తక్షణమే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ మాదినేని ఆంజనేయులు, మక్కెన కొండలు, డీసీ కొండలు, వజ్రాల కృష్ణారెడ్డి, జనసేన పార్టీ నాయకులు రాయల్ నాగ శ్రీను, బ్రహ్మం, చల్లా ప్రసాద్, పసుపులేటి నరసింహ రావు, అధికారులు ఎంపీడీవో పుల్లారెడ్డి, తహసీల్దార్ సురేష్, వైద్యాధికారి నాయక్, ఈవోపీఆర్డీ సుందరరెడ్డి, ఏపీవో కట్టా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

తహసీల్దార్, ఆర్‌ఐలకు అభినందన

వినుకొండ టౌన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవం రోజున ఉత్తమ అధికారులుగా అవార్డులు అందుకున్న వినుకొండ తహసీల్దార్ సురేష్, ఆర్‌ఐ శ్రీహరిలను చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లిఖార్జునరావులు ఘనంగా దుశ్శాలువాతో సత్కరించారు.

● వినుకొండ: వినుకొండ నియోజకవర్గంలో పనిచేస్తున్న జర్నలిస్టుల సమస్యలను పరిష్కరిస్తానని, వారికి వెవన్నంటిగా ఉండి సహాయ సహకారాలు అందిస్తానని చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. నరసరావుపేట రోడ్డులోని గంగినేని ఫంక్షన్ హాల్‌లో వినుకొండ జర్నలిస్టు అసోసియేషన్ ఆత్మీయ సమ్మేళన సమావేశం సోమవారం నిర్వహించారు.



మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్, ఆర్‌ఐలను సన్మానిస్తున్న జీవీ ఆంజనేయులు

మున్సిపల్ కమిషనర్‌కు ఘన సన్మానం

వినుకొండ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): వినుకొండ పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్ది, వినుకొండ మున్సిపాల్టీలో చేసిన సేవలకు గాను మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్ జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు చేతుల మీదుగా అవార్డులు తీసుకోవడం అభినందనీయమని చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు తెలిపారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్‌ను జీవీ ఆంజనేయులు ఘనంగా సత్కరించారు. సన్మాన కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టరు దస్తగిరి, 32వ వార్డు కౌన్సిలర్ వాసిరెడ్డి లింగమూర్తి, 23వ వార్డు కౌన్సిలర్ మార్కెట్ నన్నేసా, టీడీపీ పట్టణ పార్టీ అధ్యక్షులు ఆయూబ్‌ఖాన్, రాష్ట్ర కార్యదర్శి షమీమ్, క్లస్టర్ నాయకులు పత్తి పూర్ణ, పీవీ సురేష్, జానీ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన ఉత్పత్తులతోనే రైతులకు గిట్టుబాటు

● ఐఐపీఎం డైరెక్టర్ ప్రొఫెసర్ జాన్ మనోరాజ్

యడ్లపాడు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్లాంటేషన్ మేనేజ్‌మెంట్ (ఐఐపీఎం), స్పైసెస్ బోర్డుల సహకారంతో మిర్చి రైతులకు అవగాహన కార్యక్రమం జరిగింది. యడ్లపాడు మండలంలోని సుగంధ ద్రవ్యాల పార్కు (స్పైసెస్ పార్కు) పరిపాలనా భనంలో సోమవారం నిర్వహించిన ఈ అవగాహన సదస్సులో బెంగుళూరుకు చెందిన ఐఐపీఎం డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ జాన్ మనోరాజ్, ఐఐపీఎం అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ కె నరేంద్రన్, డాక్టర్ నబిరసూల్‌లు పాల్గొని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్పైసెస్ బోర్డు డీడీ డెబాబరం, సిబ్బంది, 50మంది మిర్చి రైతులు పాల్గొన్నారు.

వేల్పూరు దళితవాడలో సహపంక్తి భోజనాలు

వేల్పూరు (శావల్యాపురం), జనవరి 27 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర బీజేపీ ఆదేశాల మేరకు సంవిధాన్ గౌరవ్ అభియాన్ రాజ్యాంగ సమ్మాన్ కార్యక్రమంలో భాగంగా శావల్యాపురం మండలం వేల్పూరు గ్రామంలోని దళితవాడలో బీజేపీ మండలాధ్యక్షుడు గట్టుపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సహపంక్తి భోజనాలను సోమవారం నిర్వహించారు. కూటమి నాయకులు దళితవాడలో సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు బొల్లా పేరయ్య, సూరాబత్తుని శ్రీరాములు, దన్నవరపు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు

నూజెండ్ల, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాలుగు సచివాలయాల్లో గణతంత్ర దినోత్సవం సందర్భంగా జాతీయ జెండాలను ఆవిష్కరించక పోవటంపై షోకాజ్ నోటీలు జారీఅయ్యాయి. జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు నూజెండ్ల, చింతలచెరువు, ఐనవోలు, ముప్పరాజువారిపాలెం, పంచాయతీ కార్యదర్శులకు 48 గంటల్లోగా వివరణ ఇవ్వాలని షోకాజ్ నోటీసులను జారీ చేశారు.

ట్రాక్టర్ పైనుంచి పడి వ్యవసాయ కూలీ మృతి

రొంపిచర్ల, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంతగుడిపాడులో ట్రాక్టర్ పైనుంచి పడి వ్యవసాయ కూలీ మృతిచెందిన సంఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు, బంధువుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన కళ్ళం పద్మ (52) వ్యవసాయ కూలీగా పనిచేస్తోంది. పొలం పనులు ముగించుకుని ట్రాక్టర్‌పై వస్తుండగా గ్రామ సమీపంలో ట్రాక్టర్‌పై నుంచి కిందపడింది. తీవ్రంగా గాయపడటంతో నరసరావుపేట ఆసుపత్రికి తీసుకువెళ్లగా, చికిత్స పొందుతూ మృతి చెందింది. ఆమె భర్త వెంకటేశ్వరరెడ్డి ఫిర్యాదుమేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం అనంతరం ఆమె మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

నేడు నరసరావుపేటలో జాబ్ మేళా

నరసరావుపేట రూరల్, జనవరి 27: (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నేడు నిరుద్యోగ యువతకు జాబ్‌మేళా నిర్వహించడం జరుగుతుందని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి తమ్మాజీరావు తెలిపారు. పట్టణంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఉన్న ట్రైయినింగ్ సెంటర్‌లో మంగళవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు.

పది పరీక్షల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలి: కలెక్టర్

నరసరావుపేట రూరల్, జనవరి 27: పల్నాడు జిల్లాలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులందరూ నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు తెలిపారు. నరసరావుపేట పట్టణంలోని మొదటి రైల్వే గేటు వద్ద ఉన్న ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో నిర్వహించిన లక్ష్య సాధన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు ఇబ్బందిపడే సబ్జెక్టులకు అదనపు ఉపాధ్యాయులతో ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు.

స్ఫూర్తి దీపిక లోకేశ్ యువగళం పాదయాత్ర: మాజీ ఎమ్మెల్యే మక్కెన

వినుకొండ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): లోకేశ్ పాదయాత్ర ఒక స్ఫూర్తి దీపిక అవుతుందని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లిఖార్జునరావు అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్ర రెండు సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా ఆ పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని కేక్ కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు.

● ఈపూరు: యువగళం చేపట్టి రెండు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈపూరులో టీడీపీ నాయకులు సోమవారం కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి రాపర్ల జగ్గారావు, మండల పార్టీ అధ్యక్షుడు తిరుమలశెట్టి బాలయ్య, సర్పంచ్‌లు గోనుగుంట్ల శ్రీనివాసరావు, బచ్చనబోయిన వెంకట సుబ్బయ్య,డీసీ చైర్మన్ గడిపూడి వేణుగోపాల్,మాజీ జడ్పీటీసీ బందెల కన్నయ్య,వడ్లమూడి రాఘవయ్య, బొల్లా సుబ్బారావు,చాపల మల్లయ్య, మద్దం గోవిందు, మీసాల చిన్న ప్రసాదు, రాపర్ల రాము,తదితరులు పాల్గొన్నారు.

ఏజీపీ, స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులకు ఘన సన్మానం

వినుకొండ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి కార్యక్రమాలకు న్యాయపరమైన అడ్డంకులు తలెత్తకుండా సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వ న్యాయవాదులు కీలక పాత్ర పోషించాలని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా నియమితులైన ముప్పాళ్ళ జ్ఞానేశ్వరరావుతోపాటు మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులుగా నియమితులైన నక్కా రమణారావులను సోమవారం ఘనంగా సన్మానించారు.

దేవాలయ నిర్మాణానికి రూ.4.25లక్షలు విరాళం

నాదెండ్ల, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సాతులూరులో నిర్మిస్తున్న రెడ్డి పేరంటాలమ్మ దేవాలయ నిర్మాణానికి రూ.4.25లక్షల విరాళాన్ని కమిటీ సభ్యులకు అందజేశారు. ఈదర నాగమల్లేశ్వరరావు రూ.2లక్షలు, నడింపల్లి వెంకటేశ్వరరావు రూ.1.25లక్షలు, సీహెచ్ ద్రాక్షాయమ్మ రూ.లక్ష అందజేశారు.

మొక్కలు నాటాలంటూ వినూత్న ప్రచారం

వినుకొండ టౌన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విఠంరాజుపల్లి గ్రామ సమీపంలోగల జాతీయ రహదారిపై మానవసేవా సమితి ఆధ్వర్యంలో మొక్కలు నాటి పర్యవరణాన్ని కాపాడాలంటూ వినూత్న రీతిలో ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా జాతీయ రహదారి పక్కన ఉంటున్న బాటసారులకు భోజనం పెట్టి పర్యావరణ ప్రాధాన్యం గురించి వివరించారు. ప్రతి నెల చివరి ఆదివారం రహదారుల పై ప్రచారం నిర్వహించి భోజన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు సభ్యులు తెలిపారు.

నూతన వెలుగుల కోసం సీబీఎన్, లోకేశ్ కృషి

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్

నరసరావుపేట టౌన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : జగన్‌రెడ్డి నిర్వాహకంతో అంధకారంలోకి వెళ్ళిన పారిశ్రామికరంగానికి నూతన వెలుగులు తీసుకురావడం కోసం సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్ రేయింబవళ్ళు కష్టపడుతున్నారని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ సోమవారం ఒక ప్రకటనలో అన్నారు. సీఎం చంద్రబాబునాయుడ దావోస్ పర్యటన విజయవంతం అయిందని, వరల్డ్ ఎకనామిక్ ఫారం సదస్సులో ప్రత్యేక అకర్షణగా ఆంధ్రప్రదేశ్ నిలిచిందన్నారు. రాష్ట్రంలో ఉన్న అపార వనరులు, మౌలిక సదుపాయాలు, అత్యుత్తమ పాలసీల గురించి పారిశ్రామికవేత్తలకు వివరించి పెట్టుబడులు పెట్టేందుకు ఆంధ్రప్రదేశ్ అనువైన రాష్ట్రమని ఆహ్వానించారన్నారు. మైక్రోసాఫ్ట్ అధినేత బిల్‌గేట్స్, టాటా చైర్మన్ చంద్రశేఖరన్ వంటి ప్రపంచ దిగ్గజాలు సీఎం చంద్రబాబు నాయుడు విజన్‌ను మెచ్చుకోవడం, రాష్ట్రంలో పెట్టుబడి పెడతామని హామీ ఇవ్వడం చంద్రబాబు నాయుడు 2047 విజయాన్ని సూచిస్తుందన్నారు.



చిలకలూరిపేటలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి

చిలకలూరిపేటలో యువగళం సంబరాలు

చిలకలూరిపేట, జనవరి 27(ఆంధ్రజ్యోతి): లోకేశ్ యువగళం పాదయాత్ర ప్రారంభమై రెండేళ్లు అయిన సందర్భంగా చిలకలూరిపేటలో టీడీపీ శ్రేణులు సోమవారం సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక టీడీపీ కార్యాలయంలో పార్టీ కార్యకర్తల సమక్షంలో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు భారీ కేక్ కట్ చేసి లోకేశ్ కు అభినందనలు తెలిపారు.

పశుపోషణతో అదనపు ఆదాయం: ఎమ్మెల్యే ప్రత్తిపాటి

చిలకలూరిపేట టౌన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : రైతులకు వ్యవసాయంతోపాటు పశుపోషన కూడా తోడైతే అదనపు ఆదాయం లభిస్తుందని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. చిలకలూరిపేట రూరల్ మండలంలోని మానుకొండవారిపాలెంలో ఏపీ పశుగణాభివృద్ధి, ఏపీ పశుసంవర్ధక శాఖల ఆధ్వర్యంలో రాష్ట్రీయ గోకుల్ మిషన్ చేపట్టిన మేలుజాతి లేగదూడల ప్రదర్శనను సోమవారం ఎమ్మెల్యే సందర్శించారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి మాట్లాడుతూ గేదెలు, గొర్రెలు, మేకలు, కోళ్ళు వంటి పెంపకానికి ప్రభుత్వం అందించే సబ్సిడీ పథకాలపై రైతులు అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ సందర్భంగా తమ పంచాయతీని మునిసిపాలిటీలో విలీనం చేయవద్దని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు పి రామారావు, డి శ్రీనివాసరావు, డి రామ్మోహనరావు, శ్రీలత, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి షేక్ కరిముల్లా, జనసేన ఇన్‌చార్జి టి రాజారమేష్, నాయకులు మదన్‌మోహన్, కె వీరారెడ్డి, ఎస్ఎస్ సుభాని, రమేష్ తదితరులు ఉన్నారు.

నేడు యడ్లపాడులో పశు ఆరోగ్య శిబిరం

యడ్లపాడు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): జంతు సంక్షేమ పక్షోత్సవాలలో భాగంగా మంగళవారం యడ్లపాడులో పశు ఆరోగ్య శిబిరం, లేగదూడల ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు యడ్లపాడు ఏరియా పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ వై రాధాకృష్ణ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ యడ్లపాడులోని పుచ్చలపల్లి సుందరయ్య కళా ప్రాంగణం వద్ద నిర్వహించే ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ప్రత్తిపాటి ముఖ్యఅతిధిగా హాజరవుతున్నారన్నారు.